


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 31-08-2026 | సంపుటి - 31 | సంచిక - 98 | రూ : 4 | పేజీలు: 8


## సమంగా సంక్షేమం, అభివృద్ధి

- సామాజిక న్యాయానికి పెద్దపీట
- రైతులు, మహిళలు, యువతకు భరోసా
- 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- 1,000 రోజుల ప్రజాపాలనపై సర్కారు ప్రగతి నివేదిక



హైదరాబాద్: “1,000 రోజుల ప్రజాపాలనలో సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యమిచ్చాం. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలనను పునర్నిర్మించడం, సామాజిక న్యాయానికి పెద్దపీట వేయడం, రైతులుమహిళలుయువతకు భరోసా కల్పించడం, రాష్ట్రానికి భారీ పెట్టుబడులు తీసుకురావడం, భవిష్యత్తు తెలంగాణకు ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించడంలో.. కొత్త అధ్యాయాన్ని నమోదు చేశాం” అని ప్రభుత్వం పేర్కొంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో.. ప్రజా ప్రభుత్వం సెప్టెంబరు 1కి 1,000 రోజుల మైలురాయిని చేరుకుంటున్న నేపథ్యంలో.. ‘ప్రగతి నివేదిక’ను ఆదివారం విడుదల చేసింది. ‘2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా.. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యం. క్యూర్, ప్యూర్, రేర్ అభివృద్ధి వలయాలతో హైదరాబాద్ నుంచి

తరువాయి 2లో

# నవశకానికి పారిశ్రామిక ప్రగతి!

### సీఎం చంద్రబాబు ట్వీట్

- డిసెంబరు 7-9 తేదీల్లో కొత్త పాలసీలను ప్రకటించనున్న సీఎం
- ‘ఇండస్ట్రియల్ పాలసీ 2.0’ శ్రీకారానికి అడుగులు
- వేగంగా రూపుదిద్దుకుంటున్న మరో 9 విధానాలు
- పెట్టుబడులు, తయారీ, సాంకేతికతకు పెద్దపీట
- ఐదేళ్లలో భారీగా ఉద్యోగ, ఉపాధి కల్పనే ధ్యేయం
- ‘ఇన్వెస్ట్ తెలంగాణ’కు ఊతమిచ్చేలా వ్యూహం



హైదరాబాద్ : తెలంగాణను ప్రపంచస్థాయి ఆర్థిక, పారిశ్రామిక శక్తిగా తీర్చిదిద్దే ‘తెలంగాణరైజింగ్ 2047’ విజన్‌కు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక విధానాల్లో కొత్త శకానికి శ్రీకారం చుడుతోంది. ప్రస్తుత పారిశ్రామిక విధానానికి దాదాపు పదేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ‘ఇండస్ట్రియల్ పాలసీ 2.0’కు రూపకల్పన చేస్తోంది. ఐదేళ్ల వ్యవధిలో పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించడం, తయారీ రంగాన్ని విస్తరించడం, ఆధునిక సాంకేతికతలను రాష్ట్రంలోకి తీసుకురావడం, యువతకు లక్షల్లో ఉద్యోగాలు కల్పించడం, హైదరాబాద్‌తో పాటు జిల్లాలను పారిశ్రామిక వృద్ధి కేంద్రాలుగా మార్చడం లక్ష్యంగా.. 10 కీలక రంగాల్లో ప్రత్యేక పాలసీలను అమలుచేసే దిశగా వేగంగా కసరత్తు చేస్తోంది. ఇప్పటికే తెలంగాణకు బలమైన పునాదిగా ఉన్న ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల పురోభివృద్ధిలో భాగంగా దావోస్ వేదికగా ‘లైఫ్ సైన్సెస్ పాలసీ 2.0’ని ప్రభుత్వం తీసుకొచ్చింది. డిసెంబరు 7, 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న ‘తెలంగాణ రైజింగ్ 2047 గ్లోబల్ సమిట్’ వేదికపై మరో 9 కొత్త విధానాలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించనున్నారు.

తరువాయి 2లో



### తారుమారైన సీన్..
## రష్యాకే పెట్రోల్ ఎగుమతి చేస్తున్న భారత్

- ఉక్రెయిన్ డ్రోన్ దాడులతో రష్యాలో తీవ్రమైన పెట్రోల్ కొరత
- రష్యాకు భారీగా పెట్రోల్ ఎగుమతి చేస్తున్న భారత్
- గత రెండు నెలల్లో సుమారు 10 లక్షల బ్యారెల్ల సరఫరా
- ఇరాన్ యుద్ధంతో రష్యా నుంచి ముడి చమురు దిగుమతులు పెంచుకున్న భారత్
- దిగుమతులు తగ్గినా భారత్‌కు రష్యానే అతిపెద్ద చమురు సరఫరాదారు

2లో

### జెండాను కాలితో తన్నుతూ
## ఖలిస్థానీల కండకావరం.. కేంద్రమంత్రి వార్నింగ్

- న్యూయార్క్‌లో ఖలిస్థానీ మద్దతుదారుల దుశ్చర్య
- భారత జాతీయ పతాకాన్ని కాలితో తొక్కిన ఆందోళనకారులు
- ఘటనపై తీవ్రంగా స్పందించిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు
- దేశాన్ని, జెండాను అవమానిస్తే సహించేది లేదని స్ట్రాంగ్ వార్నింగ్



- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలు

2లో



### నేపాల్‌లో మరో జల ప్రళయం
## మరో హై అలర్ట్ జారీ

- నేపాల్‌లోని భోటే కోశీ నదికి ఆకస్మిక వరద హెచ్చరిక జారీ
- నదిలో ప్రవాహం పెరిగిన శబ్దాలు రావడంతో అప్రమత్తమైన అధికారులు
- రసువా, నువాకోట్, ధాదింగ్ జిల్లాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచన
- సహాయక చర్యల్లోని సిబ్బంది అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని విజ్ఞప్తి

2లో

## ఉజ్బెకిస్థాన్‌లో యోగా సెషన్..
### ఆసక్తిగా వీక్షించిన ప్రధాని మోదీ



- రెండు రోజుల పర్యటన నిమిత్తం ఉజ్బెకిస్థాన్ వెళ్లిన ప్రధాని మోదీ
- తాష్కెంట్‌లో జరిగిన యోగా కార్యక్రమంలో పాల్గొని సాధకులను అభినందించారు
- అధ్యక్షుడు షావ్కత్ మిర్జియోయేవ్‌తో ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు
- పర్యటన అనంతరం కిర్గిస్థాన్‌లో జరిగే ఎస్‌సీవో సదస్సులో పాల్గొననున్న ప్రధాని

2లో

ప్రధాని మోదీకి అత్యున్నత పౌర పురస్కారం ప్రదానం చేసిన ఉజ్బెకిస్థాన్

2లో



### దేశవ్యాప్తంగా ముగిసిన నీట్ పీజీ2026 పరీక్ష..
## జైపూర్‌లో కొందరికి మళ్లీ నిర్వహణ

- మొత్తం 2.65 లక్షల మందికి పైగా హాజరైన అభ్యర్థులు
- జైపూర్‌లో విద్యుత్ అంతరాయం... 2,445 మందికి మళ్లీ పరీక్ష
- సెప్టెంబర్ 5న ప్రభావిత విద్యార్థులకు తిరిగి పరీక్ష నిర్వహణ
- భారీ భద్రత, నిఘా మధ్య పరీక్షలు నిర్వహించిన ఎన్‌బీఈఎంఎస్

2లో

### ప్రపంచానికే ప్రళయం వచ్చినా..
## ఈ దేశం తట్టుకుని నిలబడుతుంది!

- ప్రపంచ విపత్తులను తట్టుకునే దేశాల్లో ఆస్ట్రేలియా నంబర్ వన్
- గ్లోబల్ ఛాలెంజెస్ జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనంలో వెల్లడి
- ద్వీప దేశం కావడం, ఆహార ఉత్పత్తిలో స్వయం సమృద్ధి ప్రధాన బలాలు
- న్యూజిలాండ్, జపాన్, స్విట్జర్లాండ్, అర్జెంటీనాలు తర్వాతి స్థానాల్లో
- ఏ దేశానికీ పూర్తిస్థాయి భద్రత లేదని స్పష్టం చేసిన పరిశోధకులు



ప్రపంచవ్యాప్తంగా పెను విపత్తు సంభవించి, మానవ నాగరికతకే ముప్పు వాటిల్లితే ఏ దేశం తట్టుకోగలదు? ఈ ప్రశ్నకు సమాధానం కనుగొనేందుకు జర్మనీలోని హేగన్ విశ్వవిద్యాలయ పరిశోధకులు ఒక విస్తృత అధ్యయనం చేపట్టారు. ‘గ్లోబల్ ఛాలెంజెస్’ అనే ప్రముఖ సైన్స్ జర్నల్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనం ప్రకారం, అలాంటి తీవ్రమైన విపత్తులను ఎదుర్కొని నిలబడగల అత్యంత స్థితిస్థాపకత కలిగిన దేశం ఆస్ట్రేలియా అని తేలింది. పరిశోధకులు ప్రపంచ విపత్తులను ప్రధానంగా మూడు రకాలుగా వర్గీకరించి విశ్లేషించారు. మొదటిది, భారీ అగ్నిపర్వతాల విస్ఫోటనం, గ్రహశకలాల దాడి లేదా అణు యుద్ధం వంటి వాటి

తరువాయి 2లో

# తారుమారైన సీన్.. రష్యాకే పెట్రోల్ ఎగుమతి చేస్తున్న భారత్

అంతర్జాతీయ ఇంధన మార్కెట్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. సాధారణంగా ముడి చమురు కోసం రష్యాపై ఆధారపడే భారత్, ఇప్పుడు అదే రష్యాకు పెట్రోల్ ఎగుమతి చేసే కీలక దేశంగా అవతరించింది. ఉక్రెయిన్ డ్రోన్ దాడులతో రష్యాలోని చమురు శుద్ధి కర్మాగారాలు (రిఫైనరీలు) తీవ్రంగా దెబ్బతినడమే ఇందుకు ప్రధాన కారణం. దీంతో ఏర్పడిన తీవ్రమైన ఇంధన కొరతను అధిగమించేందుకు రష్యా, భారత్ నుంచి పెట్రోల్‌ను దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఎనర్జీ అనలిటిక్స్ సంస్థ వోర్టెక్సా నివేదిక ప్రకారం.. గత రెండు నెలల్లో (జులైఆగస్టు) రష్యా రిఫైనరీలపై సుమారు 32 సార్లు డ్రోన్ దాడులు జరిగాయి. దీనివల్ల దేశీయంగా పెట్రోల్ ఉత్పత్తి ఏకంగా 70% పడిపోయింది. ఫలితంగా రష్యాలోని పెట్రోల్ బంకుల వద్ద వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరాయి. ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు రష్యా ప్రభుత్వం తన దేశం నుంచి పెట్రోల్, డీజిల్ ఎగుమతులను నిషేధించింది. ఈ నేపథ్యంలో భారత్ గత రెండు నెలల్లో దాదాపు 10 లక్షల బ్యారెళ్ల పెట్రోల్‌ను రష్యాకు సరఫరా చేసింది. భారత్‌తో పాటు తుర్కియే, మొరాకో కూడా రష్యాకు ఇంధనాన్ని అందిస్తున్నాయి. గుజరాత్‌లోని వడినార్‌లో ఉన్న నయారా ఎనర్జీ రిఫైనరీ నుంచే ఈ ఎగుమతుల్లో ఎక్కువ భాగం జరిగినట్లు వాణిజ్య వర్గాలు తెలిపాయి. ఈ రిఫైనరీలో రష్యా ప్రభుత్వ రంగ సంస్థ రాస్‌నెఫ్ట్‌కు వాటా ఉండటం గమనార్హం. మరోవైపు, ప్రపంచంలో మూడో అతిపెద్ద రిఫైనర్‌గా ఉన్న భారత్ తన సామర్థ్యాన్ని 272 ఎంఎంటీపీఏ నుంచి 300 ఎంఎంటీపీఏకు పెంచుకోవడం ద్వారా గ్లోబల్ రిఫైనింగ్ హబ్‌గా తన స్థానాన్ని పటిష్ఠం చేసుకుంటోందని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి ఇటీవల పేర్కొన్నారు. అదే సమయంలో ఇరాన్ యుద్ధం, హర్మ్యూజ్ జలసంధి మూసివేత వంటి పరిణామాల నేపథ్యంలో భారత్ తన ముడి చమురు దిగుమతులను కూడా విస్తృతం చేసుకుంది. ఒకప్పుడు 27 దేశాల నుంచి ముడి చమురును దిగుమతి చేసుకున్న భారత్, ఇప్పుడు 41 దేశాల నుంచి కొనుగోలు చేస్తోంది. హర్మ్యూజ్ జలసంధి ద్వారా రవాణా నిలిచిపోవడంతో, రష్యా నుంచి భారత్ ముడి చమురు దిగుమతులు రికార్డు స్థాయికి చేరాయి. అయితే, కెప్లర్ డేటా ప్రకారం ఆగస్టులో దిగుమతులు కాస్త తగ్గి 2.1 మిలియన్ బ్యారెళ్లకు చేరాయి. అయినప్పటికీ, దేశ మొత్తం దిగుమతుల్లో 40% వాటాతో భారత్‌కు అతిపెద్ద ముడి చమురు సరఫరాదారుగా రష్యానే కొనసాగుతోంది.

## నవశకానికి పారిశ్రామిక ప్రగతి!

హైదరాబాద్ : తెలంగాణను ప్రపంచస్థాయి ఆర్థిక, పారిశ్రామిక శక్తిగా తీర్చిదిద్దే 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌కు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక విధానాల్లో కొత్త శకానికి శ్రీకారం చుడుతోంది. ప్రస్తుత పారిశ్రామిక విధానానికి దాదాపు పదేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో 'ఇండస్ట్రియల్ పాలసీ 2.0'కు రూపకల్పన చేస్తోంది. ఐదేళ్ల వ్యవధిలో పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించడం, తయారీ రంగాన్ని విస్తరించడం, ఆధునిక సాంకేతికతలను రాష్ట్రంలోకి తీసుకురావడం, యువతకు లక్షల్లో ఉద్యోగాలు కల్పించడం, హైదరాబాద్‌తో పాటు జిల్లాలను పారిశ్రామిక వృద్ధి కేంద్రాలుగా మార్చడం లక్ష్యంగా.. 10 కీలక రంగాల్లో ప్రత్యేక పాలసీలను అమలుచేసే దిశగా వేగంగా కసరత్తు చేస్తోంది. ఇప్పటికే తెలంగాణకు బలమైన పునాదిగా ఉన్న ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల పురోభివృద్ధిలో భాగంగా దావోస్ వేదికగా 'లైఫ్ సైన్సెస్ పాలసీ 2.0'ని ప్రభుత్వం తీసుకొచ్చింది. డిసెంబరు 7, 8, 9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ 2047 గ్లోబల్ సమిట్' వేదికపై మరో 9 కొత్త విధానాలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించనున్నారు.

* **భారీ, మెగా పరిశ్రమలకు ప్రోత్సాహకాలు..**

కొత్త పారిశ్రామిక విధానాల రూపకల్పనలో కేవలం పెట్టుబడి విలువను మాత్రమే కొలమానంగా తీసుకోకుండా.. ఉపాధి కల్పన, తయారీ సామర్థ్యం, స్థానిక విలువ జోడింపు, ఎగుమతులు, పారిశ్రామిక ఎకోసిస్టమ్, ప్రభుత్వ ఆదాయం వంటి అంశాలతోపాటు భారీ తయారీ పరిశ్రమలు, లైఫ్ సైన్సెస్, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, ఫుట్‌వేర్‌అప్పెరల్ వంటి ఉపాధి ఆధారిత రంగాలకు సర్కారు ప్రాధాన్యం ఇవ్వనుంది. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ఇప్పటికే ప్రత్యేక విధానం ఉన్న నేపథ్యంలో.. 'ఇన్వెస్ట్ తెలంగాణ' నినాదానికి ఊతమిచ్చేలా.. పెద్ద, భారీ, మెగా పరిశ్రమలకు మరింత ఆకర్షణీయమైన ప్రోత్సాహకాలను కొత్త విధానాల్లో పొందుపర్చనున్నారు. జిల్లాలు, టైర్2, 3 నగరాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసే సంస్థలకు అదనపు ప్రోత్సాహకాలు కల్పించడం ద్వారా ప్రాంతీయ పారిశ్రామిక వృద్ధిని వేగవంతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

## భారత్‌తో ఘర్షణల నాటి జనరల్‌ను పదవుల నుంచి తొలగించిన చైనా

భారత్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు నెలకొన్న సమయంలో కీలక బాధ్యతలు నిర్వర్తించిన పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్‌ఏ) మాజీ జనరల్ జావో జోంగ్కిపై చైనా ప్రభుత్వం వేటు వేసింది. దేశంలోని అత్యున్నత రాజకీయ సలహా మండలి సభ్యత్వంతో పాటు ఆయన నిర్వహిస్తున్న ఇతర కీలక రాజకీయ పదవుల నుంచి జీవోను తొలగించింది. 2017లో జరిగిన డోక్లాం ప్రతిష్టంభన, 2020 నాటి గల్వాన్ లోయ ఘర్షణల సమయంలో జావో జోంగ్కి పీఎల్‌ఏ వెస్ట్రన్ థియేటర్ కమాండ్‌కు అధిపతిగా వ్యవహరించారు. చైనీస్ పీపుల్స్ పొలిటికల్ కన్సల్టేటివ్ కాన్ఫరెన్స్ (CPPCC) స్టాండింగ్ కమిటీ ఆగస్టు 26న సమావేశమై జావోను పదవుల నుంచి తొలగించాలని ఓటింగ్ ద్వారా నిర్ణయించింది. జాతీయ కమిటీ సభ్యత్వంతో పాటు, జాతి, మతపరమైన వ్యవహారాల కమిటీ డిప్యూటీ డైరెక్టర్ పదవి నుంచి కూడా ఆయన్ను తప్పించారు. అయితే, ఈ నిర్ణయానికి గల కారణాలను చైనా ప్రభుత్వం అధికారికంగా వెల్లడించలేదు. ఆయనపై ఎటువంటి విచారణకు ఆదేశించినట్లు కూడా ఇప్పటివరకు ప్రకటించకపోవడం గమనార్హం. భారత్‌తో సరిహద్దు వ్యవహారాలను పర్యవేక్షించే వెస్ట్రన్ థియేటర్ కమాండ్‌కు 2016లో తొలి కమాండర్‌గా జావో నియమితులయ్యారు. ఆయన పదవీకాలంలోనే 2017లో 73 రోజుల పాటు డోక్లాం ప్రతిష్టంభన కొనసాగింది. అలాగే 2020లో 20 మంది భారత సైనికులు వీరమరణం పొందిన గల్వాన్ ఘర్షణలు కూడా ఆయన పర్యవేక్షణలోనే జరిగాయి. అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ సైన్యంలో చేపట్టిన భారీ ప్రక్షాళనలో భాగంగానే ఈ చర్యలు తీసుకున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఇటీవలే తీవ్రమైన క్రమశిక్షణా ఉల్లంఘనల ఆరోపణల నేపథ్యంలో జనరల్ జాంగ్ యోక్సియా, లియు జెన్లీలను కూడా సెంట్రల్ మిలిటరీ కమిషన్ నుంచి తొలగించారు. సైన్యంపై తన పట్టును మరింత బిగించుకునే క్రమంలోనే జిన్‌పింగ్ వరుసగా ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి.

## జెండాను కాలితో తన్నుతూ ఖలిస్థానీల కండకావరం.. కేంద్రమంత్రి వార్నింగ్

అమెరికాలో ఖలిస్థానీ మద్దతుదారులు మరోసారి రెచ్చిపోయారు. భారత జాతీయ పతాకాన్ని దారుణంగా అవమానించారు. ఈ ఘటనపై కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వారికి గట్టి హెచ్చరిక జారీ చేశారు. దేశాన్ని, జాతీయ జెండాను అవమానిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. వివరాల్లోకి వెళ్తే, న్యూయార్క్‌లో ఆర్ఎస్ఎస్ చీఫ్ పాల్గొన్న ఓ కార్యక్రమం వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. అక్కడికి చేరుకున్న కొందరు ఖలిస్థానీ సానుభూతిపరులు ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో వారు భారత జాతీయ జెండాను కిందపడేసి, కాళ్లతో తొక్కారు. అంతటితో ఆగకుండా జెండాను చించివేస్తూ దురుసుగా ప్రవర్తించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఈ వీడియోలపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఎక్స్ వేదికగా స్పందించారు. ఖలిస్థానీలకు తీవ్ర స్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. "మీకు ఆర్ఎస్ఎస్‌ను, బీజేపీని, కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించే స్వేచ్ఛ ఉంది. కానీ మన దేశాన్ని అవమానించవద్దు. జాతీయ జెండాను అగౌరవపరచవద్దు. అది మీకు చాలా ప్రమాదకరం" అని ఆయన తన పోస్టులో స్పష్టం చేశారు. విదేశీ గడ్డపై భారత జాతీయ పతాకానికి జరిగిన ఈ అవమానంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. దేశ గౌరవానికి భంగం కలిగించే ఇలాంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని కేంద్రం ఈ హెచ్చరిక ద్వారా తేల్చిచెప్పినట్టయింది.

## దేశవ్యాప్తంగా ముగిసిన నీట్ పీజీ-2026 పరీక్ష

దేశవ్యాప్తంగా మెడికల్ పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్‌పీజీ 2026 పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 2.65 లక్షల మందికి పైగా అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. అయితే, జైపూర్‌లోని ఒక పరీక్షా కేంద్రంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో అక్కడి అభ్యర్థులకు మళ్లీ పరీక్ష నిర్వహించనున్నట్లు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (NBEMS) ప్రకటించింది. దేశంలోని 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 339 నగరాల్లో ఏర్పాటు చేసిన 1,111 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించారు. మొత్తం 2.73 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా, వీరిలో 2,65,980 మంది పరీక్షకు హాజరయ్యారని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. పరీక్షల నిర్వహణ ప్రక్రియ అత్యంత భద్రత నడుమ, సజావుగా సాగిందని ఎన్‌బీఈఎంఎస్ ఒక ప్రకటనలో సంతృప్తి వ్యక్తం చేసింది. పరీక్షల నిర్వహణ దేశవ్యాప్తంగా సజావుగా సాగినప్పటికీ, జైపూర్‌లోని ఒక కేంద్రంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కారణంగా సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో అక్కడ పరీక్ష రాస్తున్న 2,445 మంది అభ్యర్థులు ఇబ్బందులు పడ్డారు. ఈ ప్రభావిత విద్యార్థుల కోసం సెప్టెంబర్ 5వ తేదీ మధ్యాహ్నం తిరిగి పరీక్ష నిర్వహించనున్నట్లు ఎన్‌బీఈఎంఎస్ స్పష్టం చేసింది. అభ్యర్థులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామని, విద్యార్థులందరికీ సమాన అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని బోర్డు తెలిపింది. వారికి పరీక్షా కేంద్రం వివరాలు త్వరలోనే తెలియజేస్తామని హామీ ఇచ్చింది. పరీక్షల నిర్వహణను పకడ్బందీగా చేపట్టేందుకు ఎన్‌బీఈఎంఎస్ భారీ ఏర్పాట్లు చేసింది. దేశవ్యాప్తంగా 16 ప్రాంతీయ కమాండ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. పరీక్షల తీరును పర్యవేక్షించేందుకు 2,527 మంది ఫ్యాకల్టీ సభ్యులను ఇండిపెండెంట్ అప్రైజర్లుగా నియమించారు. అదనంగా, 700 మందికి పైగా డీన్లు, డైరెక్టర్లు, సీనియర్ ప్రొఫెసర్లతో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను రంగంలోకి దించారు.

## నేపాల్‌లో మరో జల ప్రళయం మరో హై అలర్ట్ జారీ

ఇటీవలే హిమానీనదం విస్ఫోటనం కారణంగా తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్న నేపాల్‌ను మరో ముప్పు భయపెడుతోంది. భోటే కోశి నదిలో నీటి ప్రవాహం ఆకస్మికంగా పెరగడంతో జాతీయ విపత్తు అవాయ తగ్గింపు, నిర్వహణ అథారిటీ (ఎన్‌డీఆర్‌ఆర్‌ఎంఏ) నేడు తీవ్ర వరద హెచ్చరికలు జారీ చేసింది. నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు, స్థానిక అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించింది. టిబెట్ సరిహద్దు సమీపంలో హిమాలయాల్లో హిమానీనదం కూలిపోవడంతో అనేక గ్రామాలు ధ్వంసమై, భారీ వరదలు సంభవించిన విషయం తెలిసిందే. ఈ పెను విషాదం నుంచి కోలుకోకముందే ఇప్పుడు భోటే కోశి నది నుంచి మరో ప్రమాదం పొంచి ఉంది. "భోటే కోశి నదిలో వరద ప్రవాహం పెరిగిన శబ్దాలు వినిపించినట్టు రసువా జిల్లా పరిపాలన కార్యాలయానికి సమాచారం అందింది" అని ఎన్‌డీఆర్‌ఆర్‌ఎంఏ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో ఒక పోస్ట్ ద్వారా వెల్లడించింది. ఈ సమాచారం మేరకు రసువా, నువాకోట్, ధాదింగ్ జిల్లాల అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరింది. నది చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తదుపరి సమాచారం అందిన వెంటనే మరిన్ని వివరాలు అందిస్తామని తెలిపింది. కొద్దిసేపటికే ఎన్‌డీఆర్‌ఆర్‌ఎంఏ మరో పోస్ట్ చేసింది. భోటే కోశిలో వరద ప్రవాహం మరింత పెరిగినట్లు నివేదికలు అందుతున్నాయని, అందువల్ల సహాయక చర్యల్లో పాల్గొంటున్న సిబ్బంది అత్యంత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. "రసువాలోని భోటే కోశి నదిలో వరద ప్రవాహం మరింత పెరిగినట్లు తెలుస్తోంది. కాబట్టి రసువా, నువాకోట్, ధాదింగ్, చిత్వాన్ సహా ప్రభావిత ప్రాంతాలలో సహాయ, పునరావాస కార్యక్రమాలలో నిమగ్నమైన సిబ్బంది, నదీ తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి" అని విజ్ఞప్తి చేసింది. ఈ ఆకస్మిక పరిణామంతో నేపాల్ అధికార యంత్రాంగం ఉలిక్కిపడింది. సహాయక బృందాలను అప్రమత్తం చేస్తూ, నష్టం జరగకుండా చర్యలు ముమ్మరం చేసింది.

## సమంగా సంక్షేమం, అభివృద్ధి

హైదరాబాద్: "1,000 రోజుల ప్రజాపాలనలో సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యమిచ్చాం. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలనను పునర్నిర్మించడం, సామాజిక న్యాయానికి పెద్దపీట వేయడం, రైతులుమహిళలుయువతకు భరోసా కల్పించడం, రాష్ట్రానికి భారీ పెట్టుబడులు తీసుకురావడం, భవిష్యత్తు తెలంగాణకు ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించడంలో.. కొత్త అధ్యాయాన్ని నమోదు చేశాం" అని ప్రభుత్వం పేర్కొంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో.. ప్రజా ప్రభుత్వం సెప్టెంబరు 1కి 1,000 రోజుల మైలురాయిని చేరుకుంటున్న నేపథ్యంలో.. 'ప్రగతి నివేదిక'ను ఆదివారం విడుదల చేసింది. '2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా.. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యం. క్యూర్, ప్యూర్, రేర్ అభివృద్ధి వలయాలతో హైదరాబాద్ నుంచి గ్రామీణ తెలంగాణ వరకు సమగ్ర అభివృద్ధి దిశగా కార్యాచరణను అమలుచేస్తున్నాం' అని నివేదికలో స్పష్టంచేసింది. అంశాలవారీగా ప్రగతిని ప్రస్తావించింది.

**ఆర్థిక ప్రగతి.. వ్యవసాయంలో నం.1**

202526లో తెలంగాణ తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరింది. దేశ తలసరి ఆదాయంతో పోలిస్తే దాదాపు 91 శాతం అధికం. సంక్షేమాన్ని కొనసాగిస్తూనే పెట్టుబడులు, ఉపాధి, మౌలిక సదుపాయాలు, సాంకేతిక రంగాల విస్తరణతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు వచ్చింది.

## ప్రధాని మోదీకి అత్యున్నత పౌర పురస్కారం ప్రదానం చేసిన ఉజ్బెకిస్థాన్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ఖాతాలో మరో అరుదైన అంతర్జాతీయ గౌరవాన్ని చేర్చుకున్నారు. మధ్య ఆసియా దేశమైన ఉజ్బెకిస్థాన్ తమ దేశ అత్యున్నత పురస్కారమైన 'ఓలియ్ దరాజలీ దోస్తిలిక్' ఆర్డర్‌తో ఆయన్ను సత్కరించింది. ఆదివారం తాష్కెంట్‌లో జరిగిన కార్యక్రమంలో ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షావ్కత్ మిర్జియోయెవ్ ఈ పురస్కారాన్ని మోదీకి ప్రదానం చేశారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంలో మోదీ చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఈ గౌరవం దక్కింది. ఈ పురస్కారంతో, ప్రధాని మోదీ ప్రపంచవ్యాప్తంగా అత్యధిక అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్న భారత నేతగా తన రికార్డును మరింత పదిలం చేసుకున్నారు. ఇప్పటివరకు ఆయన 30కి పైగా ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ పురస్కారాలు, గౌరవ డాక్టరేట్లు అందుకున్నారు. గత జులైలోనే ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో ఆ దేశ అత్యున్నత పురస్కారం 'బింటాంగ్ ఆదిపుర్న'ను మోదీకి బహూకరించిన విషయం తెలిసిందే. రెండు రోజుల పర్యటన నిమిత్తం ఉజ్బెకిస్థాన్ వెళ్లిన ప్రధాని మోదీకి తాష్కెంట్‌లో ఘన స్వాగతం లభించింది. అధ్యక్షుడు మిర్జియోయెవ్ స్వయంగా మోదీకి స్వాగతం పలికారు. అనంతరం ఇరు నేతల మధ్య ప్రతినిధుల స్థాయి చర్చలు జరిగాయి. ఈ సమావేశంలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తన పర్యటనలో భాగంగా, ప్రధాని మోదీ ఓ ప్రత్యేక యోగా సెషన్‌ను వీక్షించారు. ఉజ్బెకిస్థాన్‌కు చెందిన 52 మంది యోగా అభ్యాసకులు ఇందులో పాల్గొన్నారు. వారి ప్రదర్శనను ప్రశంసించిన మోదీ, ఉజ్బెకిస్థాన్‌ను యోగాతో అనుసంధానిస్తున్నందుకు అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. 'ఉజ్బెకిస్థాన్ యోగాను ప్రేమిస్తోంది!' అంటూ ఈ వీడియోను తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. ఈ ఏడాది జూన్‌లో అహ్మదాబాద్‌లో జరిగిన ప్రపంచ యోగాసన ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్న ఆరుగురు క్రీడాకారులు కూడా ఈ ప్రదర్శనలో ఉండటం విశేషం.

## ఉజ్బెకిస్థాన్‌లో యోగా సెషన్..
## ఆసక్తిగా వీక్షించిన ప్రధాని మోదీ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన రెండు రోజుల ఉజ్బెకిస్థాన్ పర్యటనలో భాగంగా ఆదివారం తాష్కెంట్‌లో జరిగిన ప్రత్యేక యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉజ్బెకిస్థాన్ యోగా ఫెడరేషన్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో 52 మంది యోగా సాధకులు ప్రదర్శించిన ఆసనాలను ప్రధాని ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమ ప్రాంగణంలో కలియదిరుగుతూ సాధకులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. "ఈ రోజు మీరు అద్భుతమైన యోగాను ప్రదర్శించారు. ఉజ్బెకిస్థాన్‌ను యోగాతో అనుసంధానిస్తున్న నా మిత్రుడు, దేశాధ్యక్షుడికి నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను" అని అన్నారు. కార్యక్రమం ముగిసిన అనంతరం సాధకులతో కలిసి ఆయన గ్రూప్ ఫోటో దిగారు. ఈ యోగా సెషన్‌కు సంబంధించిన వీడియోను కూడా ప్రధాని పంచుకున్నారు. అంతకుముందు శనివారం తాష్కెంట్‌కు చేరుకున్న ప్రధాని మోదీకి ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షావ్కత్ మిర్జియోయేవ్ ఘన స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి అధ్యక్ష భవనం వరకు ఇరువురు నేతలు కలిసి ప్రయాణించడం వారి మధ్య ఉన్న స్నేహపూర్వక సంబంధాలను తెలియజేసింది. అనంతరం ఇద్దరి మధ్య విందు సమావేశం జరిగింది. ఆదివారం ఇరువురు నేతలు ప్రతినిధి స్థాయి చర్చలు జరపనున్నారు.

## ప్రపంచానికే ప్రళయం వచ్చినా.. ఈ దేశం తట్టుకుని నిలబడుతుంది!

(మొదటిపేజీ తరువాయి)

వల్ల సూర్యరశ్మి భూమికి చేరకపోవడం. రెండోది, భయంకరమైన సైబర్ దాడులు, మహమ్మారులు లేదా భూ అయస్కాంత తుపానుల వల్ల విద్యుత్, రవాణా, ఆహార వ్యవస్థలు కుప్పకూలడం. మూడోది, ఖండాలను నాశనం చేసే స్థాయిలో ప్రాణనష్టం కలిగించే జీవసంబంధమైన ముప్పులు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లోనూ కీలకమైన వ్యవస్థలను కాపాడుకుంటూ మానవ మనుగడను కొనసాగించగల సామర్థ్యం ఆస్ట్రేలియాకే ఎక్కువగా ఉందని ఈ అధ్యయనం పేర్కొంది.

**ఆస్ట్రేలియాకే ఎందుకంత శక్తి?**

ఆస్ట్రేలియా పలు కారణాల వల్ల ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలిచింది. ఇది ఒక ద్వీప ఖండం కావడం వల్ల విపత్తు సమయంలో బయటి ప్రపంచంతో సంబంధాలను సులభంగా తెంచుకుని, తనను తాను కాపాడుకోగలదు. ఆహార ఉత్పత్తిలో దాదాపు స్వయం సమృద్ధి, బలమైన పారిశ్రామిక, మైనింగ్ రంగం, ఆర్థిక స్థిరత్వం, సుస్థిరమైన ప్రజాస్వామ్య పాలన వంటివి ఆ దేశానికి ప్రధాన బలాలుగా ఉన్నాయి. "భూమిపై అత్యంత స్థితిస్థాపకత కలిగిన ప్రదేశం ఆస్ట్రేలియా. అది ఒక ద్వీపం కావడం వల్ల తనను తాను వేరుచేసుకోగలదు. విపత్తుల్లో చిక్కుకునే ఇతర దేశాల ప్రభావం దీనిపై పడదు. ఆస్ట్రేలియాతో సరిహద్దులు పంచుకునే దేశాలేవీ లేవు. అక్కడ ఆహార ఉత్పత్తి చాలా ఎక్కువ, దేశీయంగా బలమైన పరిశ్రమలున్నాయి" అని ఈ పరిశోధన బృందానికి నేతృత్వం వహించిన ఫ్లోరియన్ ఉల్రిచ్ జెన్ వివరించారు. ఈ జాబితాలో ఆస్ట్రేలియా తర్వాత న్యూజిలాండ్, జపాన్, స్విట్జర్లాండ్, అర్జెంటీనా దేశాలు నిలిచాయి. అయితే, స్విట్జర్లాండ్ మినహా మిగతా దేశాలకు సునామీలు, స్థానిక అగ్నిపర్వతాల నుంచి ముప్పు పొంచి ఉందని పరిశోధకులు తెలిపారు. అయితే, ఏ దేశానికీ సంపూర్ణ భద్రత లేదని ఈ అధ్యయనం స్పష్టం చేసింది. ఇంధనం, మందులు, ఎరువుల వంటి కొన్ని అత్యవసరాల కోసం ఆస్ట్రేలియా కూడా అంతర్జాతీయ వాణిజ్యంపైనే ఆధారపడి ఉంది. ఈ అధ్యయనం కేవలం ఇతర దేశాలతో పోలిస్తే ఆస్ట్రేలియాకు ఉన్న సాపేక్ష భద్రతను మాత్రమే సూచిస్తుందని, నిజమైన ప్రపంచ విపత్తు సంభవిస్తే దాని ప్రభావం తీవ్రంగానే ఉంటుందని పరిశోధకులు తేల్చిచెప్పారు.

# దేవాలయాలు ధార్మికతకు కేంద్రాలు

**: బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్**



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : దేవాలయాలు ధార్మికతకు కేంద్రాలని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. ఆదివారం గాజుల రామారం డివిజన్ ఆదర్శ్ నగర్ లోని శ్రీ చక్ర సమేత పోచమ్మ అమ్మవారి దేవాలయం 16వ వార్షికోత్సవం అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షులు గోపాల్ యాదవ్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, కమిటీ సభ్యులు గోపాల్ రెడ్డి, చారి, దయాకర్, పాక్స్ డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు అంజన్ గౌడ్, కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, తెలంగాణ సాయి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు

* **బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్**



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. ఆదివారం సీఎంసీ దుండిగల్ సర్కిల్ పరిధి దుండిగల్ గ్రామంలో భోనాల పండుగను పురస్కరించుకొని శ్రీశ్రీశ్రీ రాజరాజేశ్వరి పోచమ్మ దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ & దేవాలయ చైర్మన్ జక్కుల కృష్ణా యాదవ్, మాజీ కౌన్సిలర్ అమురం గోపాల్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎంపీటీసీ మహేష్, దేవాలయ కమిటీ ప్రధాన కార్యదర్శి పాక్స్ వైస్ చైర్మన్ నల్తూరి కృష్ణ, కోశాధికారి శ్రీనివాస్ గౌడ్, ధార వీరస్వామి, మంగలి యాదగిరి, పిట్ల నరేష్, మంత్రి యాదగిరి, ఎల్. శ్రీనివాస్ గౌడ్, బింగి క్రిష్ణ యాదవ్, బండి బీరప్ప, కుమ్మరి వీరేష్, కుమ్మరి రాజు తదితరులు పాల్గొన్నారు.

## పండుగ పూట ఊరెళ్లారు..

# ఇంట్లో దొంగలు పడ్డారు

* **4–5 తులాల బంగారం.. 20 తులాల వెండి.. నగదు అపహరణ**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి: రాఖీ పండుగ సందర్భంగా ఇంటికి తాళం వేసి కుటుంబంతో కలిసి ఊరికి వెళ్లిన ఓ కుటుంబానికి దొంగలు షాక్ ఇచ్చారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సుభాష్ కాలనీలో శనివారం ఈ చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గమనించిన దొంగలు తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించారు. రెండు పోర్షన్లకు చెందిన బీరువాలను తెరిచి అందులో ఉన్న బ్యాగును అపహరించారు. ఇంటి తలుపులు తెరిచి ఉండటం, కోతులు ఇంట్లోకి వెళ్లి వస్తుండటాన్ని గమనించిన పక్కింటివారు అనుమానంతో యజమానులకు సమాచారం అందించారు. వెంటనే ఇంటికి చేరుకున్న బాధితులు పరిశీలించగా తాళాలు పగలగొట్టి ఉండటంతోపాటు బీరువాల్లోని బ్యాగు కనిపించలేదు. అందులో సుమారు 4-5 తులాల బంగారం, 20 తులాల వెండి పట్టీలు, రూ.4-5 వేల నగదు ఉన్నట్లు బాధితులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలి

* **ఆమ్ ఆద్మీ పార్టీ జాయింట్ సెక్రెటరీ, తెలంగాణ సయ్యద్ హైదర్ డిమాండ్**



ప్రజాస్ఫూర్తి , భైంసా : నిర్మల్ జిల్లా సారంగపూర్ మండలం చించోలి (బీ) గ్రామం సమీపంలో అటవీ భూమిలో నిరుపయోగంగా ఉన్న ఈద్గా నిర్మాణం కోసం ప్రజాధనం రూ. 5.35 కోట్లు దుర్వినియోగం చేశారని, బాధ్యులైన అధికారులపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని లోకాయుక్తను ఆశ్రయించినట్లు ఆమ్ ఆద్మీ పార్టీ జాయింట్ సెక్రెటరీ, తెలంగాణ - సయ్యద్ హైదర్ వెల్లడించారు. ఆదివారం నిర్మల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రజాధనాన్ని అక్రమంగా కేటాయించి నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ తాము సమర్పించిన ఫిర్యాదు నెం. 411/2026/B1 పై లోకాయుక్త సంస్థ తీవ్రంగా స్పందించిందని ఆయన తెలిపారు.దీనిపై సమగ్ర విచారణ జరిపి, సెప్టెంబర్ 08, 2026లోపు వివరణాత్మక నివేదికను సమర్పించాలని నిర్మల్ జిల్లా కలెక్టర్‌ను లోకాయుక్త ఆదేశించిందని స్పష్టం చేశారు.ఈ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి నిర్మల్ జిల్లా అటవీ అధికారి, నిర్మల్ మున్సిపల్ కమిషనర్ మరియు సారంగపూర్ తహసీల్దార్లకు నోటీసులు జారీ చేసి, సవివరమైన విచారణ నివేదిక కోరినట్లు తెలిపారు. ప్రజాధనాన్ని పక్కదారి పట్టించిన అధికారుల తీరుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధ్యులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

# సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలు, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శప్రాయం

* **కుత్బుల్లాపూర్ మాజీ శాసన సభ్యులు కూన శ్రీశైలం గౌడ్**



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలు, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శప్రాయమని కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. ఆదివారం ఐడిపిఎల్ చౌరస్తా వద్ద సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గౌడ కులస్తులకే పరిమితమైన నాయకుడు కాదని, సబ్బండ వర్గాల అభ్యున్నతి కోసం, అణగారిన వర్గాలకు సామాజిక న్యాయం అందించేందుకు పోరాడిన గొప్ప మహనీయుడని కొనియాడారు. అనంతరం విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఇంత ఘనంగా నిర్వహించిన నిర్వాహకులు, స్థానిక కమిటీ సభ్యులను ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో సర్దార్ పాపన్న గౌడ్ కమిటీ చైర్మన్ నందనం దివాకర్, అధ్యక్షులు గంగా శ్రీనివాస్ గౌడ్, మాజీ కార్పొరేటర్ విజయ శేఖర్ గౌడ్, ఆనంద్ గౌడ్, ప్రభా గౌడ్, జయ శ్రీ, టీ నర్సింగరావు గౌడ్, బుర్ర మణికంఠ గౌడ్, మీ శ్యామనారాయణ గౌడ్, ప్రభు, సంతోష్, సురేష్ గౌడ్, భూషణం గౌడ్, సంజు గౌడ్, రాజు గౌడ్, లక్ష్మణ్ గౌడ్, అనిల్, శివ గౌడ కుల పెద్దలు, స్థానిక నాయకులు, పలువురు ప్రముఖులు, కమిటీ సభ్యులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌కు ఘన నివాళులు అర్పించారు.

# తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పండుగ బోనాల పండుగ

* **కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్**



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పండుగ బోనాల పండుగ అని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. దుండిగల్‌లో శ్రీ రాజరాజేశ్వర పోచమ్మ తల్లి బోనాల పండుగ సందర్భంగా ఆదివారం నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రజలు ఐకమత్యంతో, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి డిసిసి ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ తో పాటు ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు డీసీసీ ఉప అధ్యక్షులు ముత్యం రెడ్డి, మాజీ సర్పంచ్ కావలి గణేష్, డివిజన్ అధ్యక్షులు మల్లేష్ యాదవ్, ప్రేమ్, ఉదయ్ గౌడ్ లతో పాటు భక్తులు, మహిళలు, యువత తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పారంపర్య వైద్యుల రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాచలంలో సెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో నిర్వహించనున్న పారంపర్య వైద్య మహా సంఘం (పి.వి.ఎం.ఎస్) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘ రాష్ట్ర సలహాదారు మొక్కల వెంకటయ్య, ఉపాధ్యక్షులు రామంచి శ్రీనివాస్, జిల్లా కన్వీనర్ సుగుణారావులు పిలుపునిచ్చారు. ఆదివారం కొత్తగూడెం పట్టణంలోని ఎస్సీబీ నగర్‌లో మొక్కల వెంకటయ్య ప్లాంటేషన్‌లో ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. భారతీయ సనాతన సాంప్రదాయ వైద్యంలోని మెలకువలను, మూలాలను, విజ్ఞానవంతుల అనుభవాలను ఇతరులకు నేర్పించే నిరంతర వైద్య విజ్ఞాన సదస్సులో భాగంగా మహాసభలను నిర్వహించడం జరుగుతుందన్నారు. భద్రాచలంలోని భక్త మార్కండేయ పద్మశాలి భవన్‌లో జరుగనున్న ఈ సభలకు ముఖ్య అతిథులుగా శైవ క్షేత్ర పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ శివ స్వామీజీ, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎంపీ (రాజ్యసభ) వద్దిరాజు రవిచంద్ర, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు, స్థానిక శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, వైద్యశ్రీ జమాల్ ఖాన్, సంగం రాష్ట్ర అధ్యక్షులు వైద్య దొంత యాత్రి మహా ఋషి, ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వర్లు, కోశాధికారులు టి. దుర్గారాణి, వి.అరుణలతోపాటు 400 మంది వైద్యులు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో మొక్కల రాజశేఖర్, హరిత దీక్షకురాలు నైనిక రజువా, సభ్యులు వి. నరసింహారావు, ఎండి ముస్తఫా, శంకర్ బంగారి, రాయి లక్ష్మీ, దశరథ్ రజువా, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

# అడవి పంది రూపంలో ముంచుకొచ్చిన మృత్యువు



జనగామ, ప్రజాస్ఫూర్తి : అడవి పంది రూపంలో ముంచుకొచ్చిన మృత్యువు తనువు చాలించిన యువకుడు,అడవి పంది అడ్డుగా రావడంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందిన విషాద సంఘటన జిల్లా కేంద్రం సమీపంలో చోటు చేసుకుంది. గానుగుపహాడ్ గ్రామానికి చెందిన కన్నెబోయిన ప్రవీణ్ (24) మృతి చెందాడు. కేవలం రెండు నెలల క్రితమే వివాహం జరిగిన యువకుడు అకాల మృతిచెందడంతో గ్రామంలో తీవ్ర విషాదం అలుముకుంది. ఈ నెల 27న పనుల నిమిత్తం వెల్దండకు వెళ్లిన ప్రవీణ్ తిరిగి ద్విచక్రవాహనం పై ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో వెంకిర్యాల శివారు ప్రాంతానికి చేరుకోగానే అకస్మాత్తుగా ఓ అడవి పంది రోడ్డుపైకి అడ్డుగా వచ్చింది. దానిని తప్పించబోయే ప్రయత్నంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడటంతో ప్రవీణ్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ప్రాణాలు కోల్పోయాడు.

* **కన్నీరుమున్నీరవుతున్న కుటుంబం...**

కొత్త జీవితాన్ని ప్రారంభించిన రెండు నెలలకే ప్రవీణ్ అకాల మరణంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. చేతికి అందిన కొడుకు కళ్లముందే దూరమవ్వడం, ఇప్పుడిప్పుడే వైవాహిక జీవితంలో అడుగుపెట్టిన భర్త తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో భార్య, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## పారదర్శకంగా కేజీబీవీ, టీజీఎంఎస్ నాన్ టీచింగ్ పోస్టుల ఎంపిక పరీక్ష



జనగామ, ప్రజాస్ఫూర్తి : సమగ్ర శిక్ష ఆధ్వర్యంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు (కేజీబీవీలు), తెలంగాణ ఆదర్శ పాఠశాలల (టీజీఎంఎస్) బాలికల వసతి గృహాల్లో ఖాళీగా ఉన్న నాన్‌టీచింగ్ పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్షను ఆదివారం జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో పారదర్శకంగా నిర్వహించారు.జిల్లాలోని కేజీబీవీల్లో మొత్తం9 నాన్ టీచింగ్ పోస్టులు, టీజీఎంఎస్ బాలికల వసతి గృహాల్లో 2 పోస్టులను భర్తీ చేయనున్నారు.ఈ పోస్టులకు మొత్తం32 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా,30 మంది ఎంపిక పరీక్షకు హాజరయ్యారు. కేజీబీవీ చిల్పూర్, నర్మెట్ట లో స్వీపర్ 1, అండ్ స్కావెంజర్ 2, పాలకుర్తిలో హెడ్ కుక్ 1, కొడకండ్లలో అటెండర్ 1, జనగామలో హెడ్ కుక్ 1, అసిస్టెంట్ కుక్ 1, స్వీపర్ అండ్ స్కావెంజర్ 1, బచ్చన్నపేటలో అసిస్టెంట్ కుక్ 1 పోస్టు ఖాళీగా ఉన్నాయి. అలాగే టీజీఎంఎస్ బాలికల వసతి గృహాల్లో బచ్చన్నపేట లో అసిస్టెంట్ కుక్ 1, రఘునాథపల్లిలో వాచ్ ఉమెన్ 1 పోస్టును భర్తీ చేయనున్నారు. పోస్టుల వారీగా అసిస్టెంట్ కుక్ పోస్టులకు 6 మంది, అటెండర్ పోస్టులకు 6 మంది, హెడ్ కుక్ పోస్టులకు 5 మంది, స్వీపర్ అండ్ స్కావెంజర్ పోస్టులకు10 మంది, వాచ్ ఉమెన్ పోస్టుకు 3 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ఏడీ శ్రీనివాస్, జీసీడీఓ గౌసియా బేగం తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ దుర్గా భవాని అమ్మవారి పునః ప్రతిష్టాపన



జీడిమెట్ల,ప్రజాస్ఫూర్తి : సూరారం డివిజన్ న్యూ శివాలయ నగర్ లో శ్రీ దుర్గా భవాని అమ్మవారి నూతన దేవాలయం నిర్మాణం & పునః ప్రతిష్టాపన ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త వెంకటేష్ గౌడ్, అధ్యక్షులు నాగరాజు, ఉపాధ్యక్షులు మణి కుమార్, కోశాధికారి వెంకటేష్, పృథ్వి రాజ్ గౌడ్, కమిటీ ఇంచార్జ్ పల్నాటి శివ కుమార్, మాజీ కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, సీనియర్ నాయకులు కొండకల్లా శ్రీనివాస్ రెడ్డి, వారాల వినోద్, కోల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# అమ్మవారి కృపతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

* **బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్**



జీడిమెట్ల,ప్రజాస్ఫూర్తి : అమ్మవారి కృపతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. ఆదివారం జీడిమెట్ల డివిజన్ వినాయక్ నగర్ లో నూతనంగా నిర్మించిన దేవాలయంలో దుర్గా భవాని అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన, బొడ్రాయి ప్రతిష్టాపన కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ పాల్గొని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో వినాయక నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు నదీమ్ రాయ్, ఆలయ కమిటీ సభ్యులు , కాలనీవాసులు నర్సింగ్ రావు, మురళీ, జీ.యాదగిరి, పాండు, సుధా, వెంకటేష్, హరి బాబు, వి.శ్రీనివాస్, మానయ్య, అనంతయ్య, శ్రీనివాస్,కరీం, అతర్ భాస్కర్, బంధప్ప, సువర్ణ, రీతూ, రాణి, షీలా, నిర్మలా, శకుంతల, సీనియర్ నాయకులు సంపత్ మాధవరెడ్డి, కుంటా సిద్ధిరాములు, కాలే నాగేష్, నరేందర్ రెడ్డి, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, సమ్మయ్య నేత, కాలే గణేష్, ఇస్మాయిల్, కుంటి మల్లేష్, బాల మల్లేష్, బాబీ, చంద్రశేఖర్ రెడ్డి, కుంట వేణు, డీజే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఐక్యతకు, సామాజిక కార్యక్రమాల నిర్వాహణకు చక్కటి వేదికలు కమ్యూనిటీ హాళ్లు

* **బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్**

జీడిమెట్ల,ప్రజాస్ఫూర్తి : ఐక్యతకు, సామాజిక కార్యక్రమాల నిర్వాహణకు చక్కటి వేదికలు కమ్యూనిటీ హాళ్లు అని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు.ఆదివారం సూరారం డివిజన్ లక్ష్మీ నగర్ లో నూతనంగా నిర్మించనున్న లక్ష్మీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన భవన నిర్మాణ పనులకు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ పాల్గొని శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను కమిటీ సభ్యులు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, సురేష్ రెడ్డి, లక్ష్మీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు అమృత రెడ్డి, ప్రధాన కార్యదర్శి శంకర్ రావు, నాయకులు ఇంద్రసేన గుప్తా, యాదిరెడ్డి, రాఘవ రెడ్డి, సురేష్, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, సీనియర్ నాయకులు కొండకల్ల శ్రీనివాస్ రెడ్డి, వారాల వినోద్, కోల శ్రీకాంత్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలకు హజరు కావాలని జెకె శేఖర్ యాదవ్ కు ఆహ్వానం



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : సెప్టెంబర్ 4న జరిగే శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఆదివారం లెనిన్ నగర్ యాదవ సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు జెకె శేఖర్ యాదవ్ ని మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్ ,రవి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# సాగు భూమిపై వివాదం.. పంట నాశనం చేస్తున్నారని ఆరోపణ

* పంచాయతీకి ముందు రాత్రి ట్రాక్టర్‌తో దున్నే యత్నం



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి : వారసత్వంగా వచ్చిన సాగు భూమిపై కొందరు అక్రమంగా హక్కులు పొందడమే కాకుండా, పంటలను నాశనం చేస్తున్నారని వెశాలపల్లి గ్రామానికి చెందిన రైతు ముద్దె సమ్మయ్య ఆరోపించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.తన తల్లిదండ్రులు ముద్దె మల్లయ్య, ఐలమ్మ మృతి అనంతరం వారి వారసుడిగా వారు సంపాదించిన జంగేడు శివారులోని సర్వే నంబర్లు 533, 530/ఏ, 581, 582, 623/బీ, 785, 787, 915లో మొత్తం 4.27 ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్నానని సమ్మయ్య పేర్కొన్నారు. జంగేడు శివారులోని సర్వే నంబర్లు 533, 530/ఏ, 581, 582, 623/బీ, 785, 787, 915లో మొత్తం 4.27 ఎకరాల భూమితో పాటు 26 గుంటల ఖాళీ స్థలం, అందులోని ఇంటిని కూడా మొత్తం మా పెద్ద బావ దొంగల కొమురయ్య, ఆయన కుమారులైన రాజాప్రతాప్, రణధీర్, భార్య కమల పేర్లపై భూములను పట్టా చేయించుకున్నారని ఆరోపించారు.

**పంటకు గడ్డి మందు పిచికారీ**

గత నెలలో తాము సాగు చేసిన పొలంలో గడ్డి మందు పిచికారీ చేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఐలయ్య తెలిపారు. ఈ సమస్యను పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ ద్వారా పరిష్కరించుకోవాలని పోలీసులు సూచించారని చెప్పారు. శనివారం పంచాయతీ జరగాల్సి ఉండగా, అంతకుముందు రాత్రి ట్రాక్టర్‌తో తమ పొలాన్ని దున్నేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. గ్రామస్తులు గమనించడంతో ట్రాక్టర్‌తో అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు తెలిపారు.

* మరో ఎకరం ఆరు గుంటలపై కూడా వివాదం

తల్లిదండ్రులు జీవించి ఉన్న సమయంలో సర్వే నంబర్ 533లోని ఎకరం ఆరు గుంటల భూమిని తన రెండో అక్క బొంతల తిరుమల శ్రీనివాస్ దంపతులకు పసుపు కుంకుమ కింద ఇచ్చినట్లు ఐలయ్య తెలిపారు. తల్లిదండ్రుల మరణం అనంతరం ఆ భూమిని కూడా తన పెద్ద బావ పట్టా చేసుకున్నారని ఆరోపించారు. తమను నమ్మించి భూములను ఇతరుల పేర్లపై పట్టా చేయించారని, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని రైతు సమ్మయ్య కోరారు.

## సైక్లింగ్ ద్వారా ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ

* **జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీకాంత్ రెడ్డి.**



ప్రజాస్ఫూర్తి, భైంసా: ఫిట్ ఇండియా కేంద్రం భైంసా వేదికగా ఆదివారం సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల్లో శారీరక దారుఢ్యం, ఆరోగ్యకర జీవనశైలి, పర్యావరణ పరిరక్షణ పట్ల చైతన్యం పెంచడమే లక్ష్యంగా ఈ సైక్లింగ్, నడక కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ నిత్యజీవితంలో శారీరక వ్యాయామానికి ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు. క్రీడలు, వ్యాయామం వల్ల మానసిక ప్రశాంతతతో పాటు ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ పెరుగుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ సైక్లింగ్, నడకను రోజువారీ అలవాటుగా మార్చుకోవాలని ఆకాంక్షించారు. ఫిట్ ఇండియా, హిట్ ఇండియా, ఆరోగ్య భారత్, సమృద్ధ భారత్ నినాదాలతో సాగిన ఈ కార్యక్రమంలో యువత, విద్యార్థులు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మన్ కీ బాత్' వీక్షణలో పాల్గొన్న నైనిక రజువా

**– బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డికి మొక్క అందజేత।**

ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహించే 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఆల్ ఇండియా రేడియో ద్వారా ప్రసారమైన కార్యక్రమాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, చుంచుపల్లి మండల అధ్యక్షుడు బలగం శ్రీధర్, ప్రకృతి ప్రేమికులు మొక్కల రాజశేఖర్‌తో కలిసి హరిత దీక్షకురాలు నైనిక రజువా వీక్షించారు. కార్యక్రమం అనంతరం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ప్రకృతి ప్రేమికుల తరపున మొక్కల రాజశేఖర్, నైనిక రజువాలు బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా నైనిక రజువాను బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందిస్తూ చిన్న వయసులోనే ఆమె చేపడుతున్న ప్రకృతి పరిరక్షణ కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

* **ప్రత్యక్ష ప్రసార వీక్షణలో పాల్గొనడం సంతోషంగా ఉంది: నైనిక**



'మన్ కీ బాత్' కార్యక్రమ ప్రత్యక్ష వీక్షణలో పాల్గొనే అవకాశం రావడం ఎంతో సంతోషంగా ఉందని నైనిక రజువా అన్నారు. మన్‌కీబాత్ ద్వారా పీఎం మోదీ 'ఏక్ పేడ్ మా కె నామ్' నినాదం పిలుపునివ్వడం ద్వారానే తాను ప్రేరణ పొందానని తెలిపారు. ప్రకృతి విపత్తుల నుండి కాపాడుకోవడం, సమయానికి వర్షాలు కురవాలన్నా మొక్కల పెంపకం ఎంతో అవసరమని నైనిక ఉద్ఘాటించారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ సింగిల్ విండో డైరెక్టర్ కూతాటి తిరుపతి



చిగురుమామిడి, ప్రజాస్ఫూర్తి:మండల పరిధిలోని బొమ్మనపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు,మాజీసింగిల్ విండో డైరెక్టర్ కూతాటి తిరుపతి ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా డీసీసీ జిల్లా కార్యదర్శి బడుకోలు దేవేందర్ రెడ్డి ఆయనకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఘనంగా కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు.డీసీసీ కార్యదర్శి బడుకోలు దేవేందర్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు మాచమల్ల రమణయ్యల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా బడుకోలు దేవేందర్ రెడ్డి,కూతాటి తిరుపతి,యువజన కాంగ్రెస్ మాజీమండల అధ్యక్షుడు మిట్టపల్లి ఆదర్శ్ లు మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా పనిచేసి గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా పనిచేస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో గ్రామం మహిళా అధ్యక్షురాలు యాంసాని కనకవ్వ,వార్డ్ సభ్యులు కొంకట బిక్షపతి,కాంగ్రెస్ సీనియర్ నాయకులు చట్ల మొగిలి,మాచమల్ల కిషోర్, బద్దిపడిగే మల్లికార్జున్ రెడ్డి, మిట్టపల్లి ఆదర్శ్,మామిడి శీను, కొమురె పరశురాములు,మామిడి రమేష్, బొమ్మనపల్లి సోషల్ మీడియా ఇంచార్జ్ మామిడి రాజు,సొల్లు శ్రీనివాస్,సొల్లు రవి, తాటిపెల్లి జగన్ రెడ్డి,బొల్లి రమేష్,మామిడి మల్లయ్య, దరిపెల్లి కనకయ్య, మాచమల్ల నరసింగరావు, కొంకట వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## గరిడేపల్లి బస్టాండ్ లో మహిళలకు కనీస వసతులను ఏర్పాటు చేయాలి

* **బీజేపీ మండల ఉపాధ్యక్షుడు మేకపోతుల వీరప్రసాద్ గౌడ్**



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : గరిడేపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్‌లో కనీస వసతులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ మండల ఉపాధ్యక్షుడు మేకపోతుల వీరప్రసాద్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు.గరిడేపల్లి మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బస్టాండ్‌లో మహిళలకు బాత్రూం, ప్రయాణికులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని, కోదాడ నుంచి వచ్చే బస్సులు బస్టాండ్‌లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పైకప్పు పెచ్చులు ఊడిపడుతున్న ప్రమాదకర భవనాన్ని వెంటనే మరమ్మతు చేయాలని, పరిసరాల్లో మద్యం సీసాలు తొలగించి పరిశుభ్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అధికారులు తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## ఉపాధ్యాయుల మహాధర్నాను విజయవంతం చేయండి

* **పీఆర్టీయూ మెదక్ జిల్లా మాజీ అధ్యక్షులు తాళ్ళ శ్రీనివాస్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎల్ మల్లారెడ్డి**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులకు ఆశనిపాతముగా మారిన సిపిస్ ను రద్దు చేసి ఓపిఎస్ విధానము ను వెంటనే పునరుద్ధరించాలని, డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్. విధానమును వెంటనే అమలు చేయాలని, ఉద్యోగ ఉపాధ్యాయులకు వెంటనే పిఆర్సి ప్రకటించాలని అనే ముఖ్యమైన 3 డిమాండ్ లతో సెప్టెంబర్ 1వ తేదీన హైదరాబాద్ నగరంలోని ఇందిరాపార్క్ వద్ద పిఆర్టియు రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో తలపెట్టిన మహాధర్నాకు మెదక్ జిల్లా నుండి అధిక సంఖ్యలో ఉద్యోగ ఉపాధ్యాయులు తరలి రావాలని పీ ఆర్ టీయూ మెదక్ జిల్లా మాజీ అధ్యక్షులు తాళ్ళ శ్రీనివాస్,రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎల్ మల్లారెడ్డి ఆదివారం పిలుపు నిచ్చారు. మెదక్ జిల్లా కేంద్రంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 2023 ఎన్నికల ప్రచారంలో భాగంగా వారి మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా సిపిఎస్ ను రద్దుచేసి ఓపీఎస్ పునరుద్ధరిస్తామని చెప్పిన ప్రకారం ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులకు తీవ్ర విఘాతం కలిగిస్తున్న సి పి ఎస్ ను రద్దు చేసి ఓ పి ఎస్ ను పునరుద్ధరించవలసిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. సిపిఎస్ ను రద్దు చేసే వరకు పిఆర్టియు పోరాటం చేస్తుందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మహా ధర్నాలో ముఖ్యమైన మూడు కింది అంశాల పైన ధర్నా ఉంటుందన్నారు.సిపిఎస్ ను రద్దు చేయాలని, పీఆర్సీ వెంటనే ప్రకటించాలని, డీఎస్సీ 2003. ఉపాధ్యాయులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాదిరిగా తెలంగాణ రాష్ట్రంలోని డిఎస్సి 2003 ఉపాధ్యాయులకు కూడా పాత పెన్షన్ విధానంను అమలు చేయాలనే అజెండాతో ఈ మహా ధర్నా కు ఉపాధ్యాయులు నీలి రంగు చొక్కలు లేదా టీ షర్ట్స్ మహిళా ఉపాధ్యాయులు నీలి రంగు సారీస్ దరించి, జిల్లా నుండి అధిక సంఖ్యలో హాజరై ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలన్నారు. ఈ కార్యక్రమములో మెదక్ జిల్లా మాజీ అధ్యక్షులు తాళ్ళ శ్రీనివాస్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎల్ మల్లారెడ్డి, జిల్లా బాధ్యులు సంగమేశ్వర్, నందరామ్ రఘుబాబు, సుభాష్ రెడ్డి , నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శివ శివాని డిగ్రీ కళాశాలలో ఘనంగా సమవర్తన–2026

* **కొంపల్లిలో రెండవ స్నాతకోత్సవం**
* **దాదాపు 700 మంది పట్టభద్రులకు డిగ్రీ పట్టాల ప్రదానం**




కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : శివ శివాని డిగ్రీ కళాశాల (అటానమస్), కొంపల్లిలో రెండవ సమవర్తన-2026 కార్యక్రమాన్ని ఆదివారం హైదవ గౌరిక్ కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాలలో వివిధ కోర్సులను విజయవంతంగా పూర్తి చేసిన దాదాపు 700 మంది పట్టభద్రులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు.ఈ కార్యక్రమానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ బి. సుధాకర్ రెడ్డి గౌరవ అతిథిగా హాజరై పట్టభద్రులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ విద్యా జ్ఞానాన్ని సమాజ అభివృద్ధికి వినియోగిస్తూ, ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ప్రస్తుత వేగంగా మారుతున్న ప్రపంచంలో విద్యార్థులు తమ విద్యను కేవలం డిగ్రీకి పరిమితం చేయకుండా, నిరంతరం కొత్త విషయాలను నేర్చుకోవడం, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం , సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా తమను తాము తీర్చిదిద్దుకోవడం ఎంతో అవసరమని సూచించారు.శివ శివాని గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ అధ్యక్షురాలు ఎస్. ఆరతి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. వైస్ ప్రెసిడెంట్ & డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డా. శైలేష్ సంపతి స్వాగత ప్రసంగం చేశారు. అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ దీపికా సంపతి కార్యక్రమంలో పాల్గొని పట్టభద్రులను అభినందించారు. ఈ సందర్భంగా శివ శివాని గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ అధ్యక్షురాలు ఎస్. ఆరతి మాట్లాడుతూ విద్యార్థులు సాధించిన విజయం వారి కృషి, పట్టుదలతో పాటు తల్లిదండ్రులు , అధ్యాపకుల నిరంతర సహకారానికి ప్రతిఫలమని అన్నారు. వైస్ ప్రెసిడెంట్ & డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డా. శైలేష్ సంపతి మాట్లాడుతూ విద్యార్థులు తమ వృత్తి జీవితంలో జ్ఞానం, నైపుణ్యాలతో పాటు నిజాయితీ, క్రమశిక్షణ, బాధ్యత ,మానవీయ విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె అన్నారు. వారు ఎంచుకున్న రంగంలో నైపుణ్యంతో పాటు మానవీయ విలువలను పాటిస్తూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. శివ శివాని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి. మమత కళాశాల అకడమిక్ రిపోర్టును సమర్పించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు బహుమతులను అందజేసి వారి విద్యా ప్రతిభను అభినందించారు. ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థులకు రూ.20,000, ద్వితీయ ర్యాంకు సాధించిన విద్యార్థులకు రూ.10,000, తృతీయ ర్యాంకు సాధించిన విద్యార్థులకు రూ.5,000 చొప్పున నగదు బహుమతులను అందజేశారు. డిగ్రీ పట్టాలు అందుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆనందోత్సాహాలతో కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టాలు అందుకున్న విద్యార్థులను అభినందిస్తూ, వారు తమ తల్లిదండ్రులు , అధ్యాపకుల త్యాగాలను ఎల్లప్పుడూ గుర్తుంచుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శివ శివాని గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్‌కు చెందిన వివిధ సంస్థల అధిపతులు, విభాగాధిపతులు, బోధనా సిబ్బంది, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు ,తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్లకు నిబంధనలు తప్పనిసరి

* **ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: సీఐ సతీష్ హెచ్చరిక**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : ఇసుక ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని చిట్యాల సీఐ వై. సతీష్ హెచ్చరించారు. అక్రమంగా ఇసుక రవాణా చేసినా, నిబంధనలు ఉల్లంఘించినా చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఆదివారం చిట్యాల సర్కిల్ కార్యాలయంలో చిట్యాల, మొగుళ్లపల్లి, టేకుమట్ల మండలాలకు చెందిన ఇసుక ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ట్రాక్టర్లను సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని సూచించారు. వాహన రిజిస్ట్రేషన్, బీమా, కాలుష్య నియంత్రణ ధ్రువపత్రం, డ్రైవింగ్ లైసెన్స్ తదితర పత్రాలు సక్రమంగా ఉండాలని తెలిపారు. డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ మాట్లాడటం, ఇయర్‌ఫోన్లు వినియోగించడం, సౌండ్ బాక్సులు పెట్టుకోవడం నిషేధమన్నారు. ఇసుక రవాణా సమయంలో రోడ్డుపై ఇసుక పడకుండా, గాలికి ఎగరకుండా లోడ్‌పై తప్పనిసరిగా పట్టా కప్పాలని ఆదేశించారు. మైనర్లతో ట్రాక్టర్లు నడిపిస్తే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా చేసినా, సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడిపినా ఉపేక్షించేది లేదన్నారు. సమావేశంలో ఎస్ఐలు పోచంపల్లి సతీష్, ఎం. సురేష్, పోలీసు సిబ్బంది, ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ తల్లి దీవెనలు ప్రజలందరిపై వుండాలి



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట:ముత్యాలమ్మ తల్లి దీవెనలు ప్రజలందరిపై వుండాలని బిజెపి రాష్ట్ర నాయకులు, మాజి ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వర రావు అన్నారు. సూర్యాపేట పట్టణం తాళ్లగడ్డ లో అత్యంత వైభవంగా జరుగుతున్న శ్రీ శ్రీ శ్రీ ఇంద్రవెల్లి ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగ సందర్భంగా, నేడు ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ శుభ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మరియు కాలనీ ప్రజలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక మన బోనాల పండుగ. . ఆ తల్లి దయతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ప్రార్థించాను అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు & మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ , బిజెపి పట్టణ అధ్యక్షులు బూర మల్సూర్ గౌడ్, కర్నాటి కిషన్,ఎండి అబిద్, చల్లమల్ల నరసింహ,సలిగంటి వీరేందర్ , పల్సమల్సూర్ గౌడ్, బండపల్లి శ్రీనివాస్, యార్లగడ్డ రామారావు, తాళ్లపల్లి మధు లు పాల్గొన్నారు.

## జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యున్ని సన్మానించిన ఎంపీ



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టం జిల్లాస్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యునిగా నూతనంగా నియమితులైన సభ్యులు గుగులోత్ కిషన్ నాయక్ మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్‌ను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.ఈ సందర్భంగా కమిటీ సభ్యుడిని ఎంపీ బలరాం నాయక్ శాలువాతో కప్పి, పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. అనంతరం ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ జిల్లాలో అణగారిన వర్గాల,దళిత, గిరిజన ప్రజల హక్కుల పరిరక్షణకు కమిటీ సభ్యులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. బాధితులకు న్యాయం జరిగేలా చూస్తూ, ప్రభుత్వ చట్టాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఎస్సీ ఎస్టీ జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ సభ్యుడు గుగులోతు కిషన్ నాయక్ మాట్లాడుతూ తనకు అప్పగించిన ఈ బాధ్యతను అత్యంత సమర్థవంతంగా నిర్వర్తిస్తానని,జిల్లా పరిధిలోని ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ,ఎస్టీ జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ సభ్యుడు గొల్లపల్లి రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మృతి చెందిన ప్రవేటు ఉపాధ్యాయుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : రైలు ప్రమాదంలో మృతి చెందిన ఉపాధ్యాయుడు గౌస్ కుటుంబానికి అండగా నిలిచేందుకు మహబూబాబాద్ జిల్లా ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ మిత్రులు మానవతా దృక్పథంతో అందించిన ఆర్థిక సహాయాన్ని ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గండు మురళి రూ.22,000ల విలువైన చెక్కును గౌస్ కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా గండు మురళి మాట్లాడుతూ,గౌస్ రైలు ప్రమాదంలో చనిపోవడం ఎంతో విషాదకరమని, ఈ కష్ట సమయంలో ఆయన కుటుంబానికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. ఉపాధ్యాయుల సహకారంతో అందించిన ఈ ఆర్థిక సహాయం కుటుంబానికి కొంతైనా తోడ్పాటుగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కోశాధికారి మాశెట్టి రాంబాబు,ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ వినోద్ ,గట్టు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో బోనాల పండుగ సందడి

జనగామ,ప్రజాస్ఫూర్తి : జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లోని వివిధ గ్రామాల్లో బోనాల పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని పోచమ్మ, పెద్దమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ తదితర గ్రామ దేవతల ఆలయాలకు మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో అందంగా అలంకరించిన బోనాలను నెత్తిన మోసుకుంటూ డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా తరలివెళ్లారు.గ్రామ పురవీధుల్లో నిర్వహించిన బోనాల ఊరేగింపులు భక్తి వాతావరణాన్ని నెల కొల్పాయి. అమ్మవారి ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, బోనాల ను సమర్పిస్తూ భక్తులు తమ మొక్కు లు చెల్లించుకున్నారు. కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని అమ్మ వారిని వేడుకున్నారు. పోతరాజుల వి న్యాసాలు,శివసత్తుల పూనకాలు, డ ప్పు కళాకారుల ప్రదర్శనలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. యువత, మహిళలు,చిన్నారులు పెద్దసంఖ్య లో పాల్గొని బోనాల సంబరాలను ఆనందో త్సాహాల మధ్య జరుపుకున్నారు.అనం తరం అమ్మవారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించా రు.జిల్లాలోని జనగామ, బచ్చన్నపేట, లింగాల ఘణపురం,దేవరుప్పుల, నర్మె ట్ట,పాలకుర్తి, కొడకండ్ల,రఘునాథపల్లి, తరిగొప్పుల తదితర మండలాల పరి ధిలోని పలు గ్రామాల్లో బోనాల వేడుక లు ఘనంగా కొనసాగాయి. గ్రామ పెద్ద లు, ప్రజాప్రతినిధులు,యువకులు, మ హిళలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పా ల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల కు ప్రతీకగా నిలిచే బోనాల పండుగ గ్రామీణ ప్రాంతాల్లో భక్తి పారవశ్యంతో నిర్వహించడం విశేషం.

# ఘనంగా ఇంద్రవెల్లి ముత్యాలమ్మ తల్లి బోనాలు



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: తెలంగాణ సంస్కృతి సంప్రదాయానికి ప్రతీక బోనాల పండుగ అని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి,రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్ అన్నారు.ఆదివారం సూర్యాపేట పట్టణంలోని తాళ్ళగడ్డ లో శ్రీశ్రీశ్రీ ఇంద్రవెల్లి ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగ సందర్భంగా వారు ముఖ్య అతిథులుగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. ఆలయ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వెలుగు వెంకన్న,కౌన్సిలర్లు రాపర్తి భవానీ శ్రీనివాస్ గౌడ్, డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్, కొండపల్లి దిలీప్ రెడ్డి, దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, ముత్యాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ బైరు వెంకన్న గౌడ్, సభ్యులు బైరు దుర్గయ్య గౌడ్, కెక్కిరేణి నాగయ్య గౌడ్, బూర బాల సైదులు గౌడ్, అనంతుల యాదగిరి గౌడ్,బూర మల్సూర్ గౌడ్, శనగాని రాంబాబు గౌడ్, కెక్కిరేణి సత్యనారాయణ గౌడ్, పల్స వెంకన్న గౌడ్, ఎల్గూరి రాంబాబు గౌడ్, రాపర్తి నాగరాజు గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంభ సభ్యులను పరామర్శించిన ప్రజా ట్రస్ట్ చైర్మన్



ప్రజా స్ఫూర్తి , భైంసా :నిర్మల్ జిల్లా ముధోల్ మండలం లోని చింతకుంట గ్రామా సర్పంచ్ గంగాధర్, యొక్క తండ్రి గంగారం ఇటీవల మృతి చేందడం జరిగింది,విషయం తెలుసుకున్న మోహన్ రావు పటిల్ ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్‌రావు పటేల్ వారి నివాసానికి వెళ్లి, కుటుంభ సభ్యులను పరామర్శించి, మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొని బాధిత కుటుంబానికి ధైర్యంగా ఉండాలని వారికి మనోధైర్యం కల్పిస్తూ ప్రగాఢ సానుభూతిని తెలియచేసారు,అదే విధంగా వీరితో మాజీ ఎంపీపీ సుభాష్ జాదవ్, సంజు,గ్రామకార్యకర్తలు,వార్డ్ మెంబర్లు గ్రామ యువకులు పాల్గొన్నారు.

# క్రీడా స్ఫూర్తితో గెలపోటములను స్వీకరించాలి

**: ప్రాజెక్టు అధికారి రాహుల్**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఉమ్మడి ఖమ్మం జిల్లా ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీలు చివరి రోజైన ఆదివారం పాల్వంచ మండలం కిన్నెరసాని మోడల్ స్పోర్ట్స్ స్కూల్‌లో ఉత్సాహంగా కొనసాగాయి. జిల్లా క్రీడల అధికారి బి. గోపాల్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలకు భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బి. రాహుల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పీఓ రాహుల్ మాట్లాడుతూ గెలుపోటములు సహజమని, ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తితో పాల్గొనాలని అన్నారు. గిరిజన ఉద్యోగులు, ఉపాధ్యాయుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడానికి ఇటువంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. గతంలో ఉద్యోగులు, ఉపాధ్యాయుల కోసం ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించిన సందర్భాలు అరుదని, ప్రస్తుతం ప్రాజెక్ట్ అధికారి చొరవతో వినూత్నంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల పాల్గొన్న వారు హర్షం వ్యక్తం చేశారు. హోరాహోరీగా సాగిన వాలీబాల్ పోటీలలో ఏకలవ్య విన్నర్స్‌గా నిలవగా రన్నర్స్‌గా భద్రాచలం జట్టు నిలిచింది. అదేవిధంగా షటిల్, క్యారమ్స్‌లో ఏటిడిఓ దమ్మపేట మొదటి స్థానాన్ని, భద్రాచలం రెండో స్థానాన్ని దక్కించుకున్నాయి. అనంతరం వివిధ క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏటిడిఓలు ఎస్. చంద్రమోహన్, ఇల్లందు భారతీదేవి, భద్రాచలం రాధమ్మ, కిన్నెరసాని మోడల్ స్పోర్ట్స్ స్కూల్ హెచ్‌ఎం ఎన్.చందు, పీఈటీలు, పీడీలు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు

# స్థానిక పత్రికలతోనే సమాజ నిర్మాణం

*** సంఘ్ క్షేత్ర ప్రచారక్ భరత్ కుమార్ జీ**

మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: ప్రపంచానికి దిశానిర్దేశం చేసేలా భారత్‌ను విశ్వగురువుగా మలిచేందుకు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ ఎస్ ఎస్) ప్రతిపాదించిన పంచపరివర్తన కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్ళి ఉత్తమ భారతీయ సమాజాన్ని రూపొందించుకోవలసిన అవసరం ఉందని సంఘ్ క్షేత్ర ప్రచారక్ భరత్ కుమార్ జీ పేర్కొన్నారు. భాగ్యనగర్‌లోని స్టాన్లీ ఇంజనీరింగ్ కాలేజీలో "సమాచార భారతి" సంస్థ ఆధ్వర్యంలో ''స్థానిక పత్రికలు సమాజ నిర్మాణం'' అంశంపై ఆదివారం జరిగిన ఇష్టాగోష్ఠి కార్యక్రమంలో ఆయన ప్రధానవక్తగా పాల్గొన్నారు.సంఘ్ క్షేత్ర ప్రచార ప్రముఖ్ నడింపల్లి ఆయుష్ జీ ముఖ్య అతిథిగా విచ్చేసిన ఈ కార్యక్రమంలో తెలంగాణలోని పలు జిల్లాల నుంచి 30కి పైగా వివిధ స్థానిక పత్రికల సంపాదకులు, పాత్రికేయులు పాల్గొని విశేష



స్పందన కనబరిచారు.సంఘం ప్రధానంగా మార్పును, పరిణామాన్ని కోరుతున్నదని,ఇవి వ్యక్తి నుంచి ప్రారంభం కావాలని, దేశ నిర్మాణం లక్ష్యంగా ఇటువంటి వ్యక్తి నిర్మాణం అనేది సంఘ్ శాఖలలో జరుగుతున్నదని భరత్ కుమార్ వివరించారు.ఇలాంటి వ్యక్తులతో కూడిన కుటుంబమే దేశానికి వెన్నెముక అన్నారు. సంఘ్ ప్రస్తుతం 90 వేలకు పైగా శాఖలు, లక్షా 50 వేలకు పైగా వివిధ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ భారతీయ సంస్కృతి విలువలను చాటి చెబుతోందన్నారు. ఆధునీకరణ అంటే పాశ్చాత్యీకరణ కాదంటూ మన దేశం పరమ వైభవ స్థితిని అందుకునేందుకు అనుసరించాల్సిన విలువలను తెలియజేశారు. సమాచార భారతి ఉపాధ్యక్షులు జి వల్లీశ్వర్ జీ మాట్లాడుతూ స్థానిక పత్రికల ప్రాధాన్యతను వివరించారు. స్థానిక పత్రికలకు ఉన్న శక్తి ప్రధాన స్రవంతిలోని జాతీయ మీడియాకు కూడా లేదని స్పష్టం చేశారు. సంఘ్ తెలంగాణ ప్రాంత ప్రచార ప్రముఖ్ రాజగోపాల్ జీ మాట్లాడుతూ సమాచార భారతి సంస్థ ఆధ్వర్యంలోని విశ్వ సంవాద కేంద్ర (వి ఎస్ కే)తెలంగాణ వెబ్ సైట్, లోకహితం జాగరణ పత్రిక, వీటి సోషల్ మీడియా ఖాతాలు, వాట్సాప్ చానెల్ ద్వారా జరుగుతున్న సమాచార సేవల గురించి స్థానిక పత్రికల సంపాదకులు, పాత్రికేయులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అనిల్ దేశాయ్, అంబాల కుమార్,తక్కలపల్లి శ్రీనివాస్, హెచ్ ప్రవీణ్,అంగోత్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ ఎస్టీ తరహాలో బీసీ గణన చేపట్టాలి

*** బీసీ హక్కుల సాధన సమితి ధనుంజయ నాయుడు డిమాండ్**



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : ఎస్సీ ఎస్టీ తరహాలో బీసీ గణన చేపట్టాలని ఇప్పటికే అనేక దశాబ్దాలుగా బీసీలు వివక్షతకు గురవుతున్నారని అందువల్ల ఇప్పుడు జరుగుతున్న జన గణనలో కులగణన చేపట్టాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి లో విడుదల చేసిన పత్రికా ప్రకటనలో.... కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జాతీయ జన గణనలో ఎస్సీ ఎస్టీలను లెక్క కట్టినట్లుగా బీసీలను లెక్కించాలని లేకపోతే బిజెపి పార్టీ దాని మిత్రపక్షాలు తగు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని జాతీయ కుల గణన చేస్తున్న క్రమంలో ఎస్సీ ఎస్టీలకు లెక్కలు ఉన్నట్లే బిసి కులాల లెక్కలు ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన లాగానే జనగణలలో బీసీల సంఖ్యను నమోదు చేయాలని ప్రస్తుతం కులగణ న లో భాగంగా ఉన్న ప్రస్తుత ప్రశ్నావళి ని రద్దు చేయాలని స్పష్టంగా ఉండే కొత్త ప్రశ్నావళి రూపొందించాలని జనాభాకు చెందిన సమాచార డేటా దుర్వినియోగం కాకుండా చూడాలని కచ్చితంగా డేటా లేకపోతే విద్య ఉపాధి సంక్షేమం సరిగా అమలు చేయలేమని రాజకీయ పార్టీలు నిపుణులతో సంప్రదించి కొత్త ప్రశ్నవళి రూపొందించాలని తెలంగాణ బీహార్లలో అవలంబించిన విధానాలు అనుసరించాలని ఆయన సూచించారు. అలాగే ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు మళ్లించేందుకు కొంతమంది అధికారులు ప్రయత్నిస్తున్నారని వారి పైన కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ ఎస్టీ ఉప ప్రణాళికల కింద కేటాయించిన నిధులను దారి మళ్ళించటం లేదా సంక్షేమ అభివృద్ధికి సక్రమంగా వినియోగించని అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్కు విజ్ఞప్తి చేశారు. షెడ్యూలు కులాలు షెడ్యూల్డ్ తెగలకు చెందిన వారిపై జరుగుతున్న అఘాయిత్యాల కేసులను త్వరితగతిన పరిష్కరించాలని బాధితులకు వేగంగా న్యాయం జరిగేలా చూడటానికి ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఉపప్రణాళిక నిధులను ఎలాంటి మళ్ళింపు లేకుండా జనాభా ఆధారంగా ఎస్సీ ఎస్టీ వర్గాల అభివృద్ధికి సంక్షేమ కోసం మాత్రమే ఖచ్చితంగా ఖర్చు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# పోనుగోడులో ఘనంగా శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ బోనాల ఉత్సవాలు



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి :గరిడేపల్లి మండలం పోనుగోడు గ్రామంలో శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ బోనాల పండుగ అంగరంగ వైభవంగా ముగిసింది. గ్రామంలో ఆనవాయితీ ప్రకారం సర్పంచ్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. మహిళా భక్తులు బోనాలతో ఊరేగింపుగా తరలిరాగా, మేళతాళాలు, దప్పుల చప్పుళ్లు, ఏటాపోతుల కోలాహలం నడుమ గ్రామం అంతా భక్తిపారవశ్యంలో మునిగితేలింది. గరిడేపల్లి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు, పోనుగోడు గ్రామ సర్పంచ్ కటకం వేణు దంపతులు ప్రత్యేకంగా బోనం ఎత్తుకుని అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ కటకం వేణు మాట్లాడుతూ గ్రామంలో సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ముత్యాలమ్మ తల్లిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కటకం ఆశా రమేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నందిపాటి కోటయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు నేలపట్ల వెంకటేశ్వర్లు, వార్డు మెంబర్లు నందిపాటి నాగమణి వెంకన్న, రామ్, మధు, నందిపాటి నలినిరమేష్ పాల్గొన్నారు. వీరితో పాటు పోలంపల్లి సైదులు, సజ్జల నాగిరెడ్డి, చామకరి గరుస్వామి, వేముల దమయంతి, కటకం శ్రీనివాస్, నక్క మట్టయ్య, రెడ్డిపల్లి సైదులు, నందిపాటి నరేష్, ఒగ్గు మహేష్, చిట్టికెల రాహుల్, నందిపాటి పృథ్వీ, నందిపాటి రామకృష్ణ, షేక్ సైదులు, కోడి మల్లయ్య, చామకూరి సుధాకర్, ఆవుల నాగయ్య, చామకూరి వెంకన్న, నక్క వెంకన్న, ఆఫ్రిది, మంగ సుధాకర్, జూలకంటి నరేష్, పంతంగి మహేష్, జూలకంటి భరత్‌లతో పాటు గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మహాధర్నాకు చిగురుమామిడి మండలం నుంచి పెద్దఎత్తున పార్టీ శ్రేణులు తరలిరావాలి



చిగురుమామిడి, ప్రజాస్ఫూర్తి: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నెం.22ఏ ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బిజెపి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సిద్దిపేట ఆర్డీఓ కార్యాలయం వద్ద నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ చిగురుమామిడి మండల బిజెపి అధ్యక్షుడు పోలోజు సంతోష్ అధ్యక్షతన జరిగిన సన్నాహక ముఖ్యుల సమావేశం నిర్వహించారు.సన్నాహక సమావేశానికి హాజరైన బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మండల ప్రభారీ ఖమ్మం వేంకటేశం బిజెపి మండల అధ్యక్షుడు పోలోజు సంతోష్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆగస్టు 31 సోమవారం జరిగే ధర్నా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ . రాంచందర్ రావు గారు విశిష్ట అతిథులుగా మెదక్, నిజామాబాద్ ఎంపీ లు మాదవనేని రఘునందన్ రావు, ధర్మపురి అరవింద్ హాజరవుతున్నారని సోమవారం ఉదయం 10:గం"నుండి మధ్యాహ్నం 2: గంటల వరకు ధర్నా కొనసాగుతుందని వివరించారు.ప్రజల భూములపై ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటే బిజెపి చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. రైతులు, సామాన్య ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా కష్టపడి సంపాదించుకున్న భూములపై అనిశ్చితి నెలకొల్పే విధానాలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.ప్రజల హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వం ప్రజల్లో ఆందోళన కలిగించే జీవోలను తీసుకురావడం దురదృష్టకరమని విమర్శించారు. జీఓ 22ఏ విషయంలో ప్రభుత్వం తప్పు జరిగిందని సాక్షాత్తు రెవెన్యూశాఖ మంత్రి చెప్పిన కూడా ప్రభుత్వం మొండివైఖరి వీడి ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు. బిజెపి అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల పక్షాన నిలబడే పార్టీ అని, ప్రజల భూములు హక్కులు ఆస్తుల పరిరక్షణ కోసం ఎంతటి పోరాటానికైనా బిజెపి సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. జీఓ 22Aను రద్దు చేసే వరకు బిజెపి పోరాటం ఆగదని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిద్దిపేట ఆర్డీఓ కార్యాలయం వద్ద జరిగే బిజెపి మహాధర్నాకు చిగురుమామిడి మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేయాలని ఆయన కోరారు ప్రజల భూముల కోసం... ప్రజల హక్కుల కోసం...జీఓ 22ఏ రద్దు కోసం బిజెపి పోరాటం కొనసాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి గుణుకుల మధుసూదన్ రెడ్డి,బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యుడు అచ్చ రవీందర్,బిజెపి ఓబీసీ మోర్చ జిల్లా ఉపాధ్యక్షుడు కంది శంకర్,బిజెపి మండల కార్యదర్శి నడిగొట్టు కిరణ్,బిజెపి మండల కార్యవర్గ సభ్యుడు మామిడి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# రాయని గూడెం లో అంగరంగ వైభవంగా ముత్యాలమ్మ బోనాల పండుగ



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: డీజే వాయిద్యాలు కోలాటాలు భక్తిశ్రద్ధలతో అత్యున్నత వైభవంగా నిర్వహించుకున్నాం ముత్యాలమ్మ బోనాల పండుగ రాయనిగూడెం ప్రజానీకం భక్తులు మహిళలు యువత పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి ఆశీస్సులు మనస్ఫూర్తిగా పొందారు. అమ్మవారు ఆశీస్సులతో గ్రామం సుభిక్షంగా ఉండాలని గ్రామ ప్రజలు కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గుండు గురవయ్య, గుండు నరసింహ, గుండు నరేష్, గుండు అశోక్, గుండు ప్రవీణ్, గుండు శ్రీను, తుమ్మల కోటయ్య ,పరమేష్ ,ముత్యాలు, లక్ష్మడు, వీరాంజి మిథున్ ,ఎలేంద్ర ,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్

*** రెబ్బెన సీఐ సంజయ్**



కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా, ప్రజా స్ఫూర్తి: ఎస్పీ నితిక పంత్ ఆదేశాల మేరకు రెబ్బెన మండలంలోని ఎన్టీఆర్ కాలనీ లో ఆదివారం సర్కిల్ ఇన్స్పెక్టర్ కే. సంజయ్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ (కార్డన్ అండ్ సెర్చ్) కార్యక్రమాన్ని నిర్వహించారు. నేరాల నియంత్రణ, ప్రజలకు రక్షణ కల్పించడమే ధ్యేయంగా నిర్వహించిన ఈ తనిఖీల్లో అక్రమ మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై కేసులు నమోదు చేయడంతో పాటు సరైన పత్రాలు లేని 40 వాహనాలను స్వాధీనం చేసుకుని, మోటారు వాహన చట్టం ప్రకారం చర్యలు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.ఈ సందర్భంగా సీఐ కే. సంజయ్ మాట్లాడుతూ... ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీ లు మరియు బ్యాంకు ఖాతా వివరాలను అపరిచితులకు ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని సూచించారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉండాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని హెచ్చరించారు. గ్రామాల్లో అక్రమ కార్యకలాపాలు లేదా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 112 కి, డ్రగ్స్ సమాచారం కోసం 1908 కి, సైబర్ మోసాలపై 1930 కి ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు; సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.ఈ తనిఖీ కార్యక్రమం మరియు అవగాహన సదస్సులో రెబ్బెన సబ్ ఇన్స్పెక్టర్ ఎ. వెంకటకృష్ణతో పాటు 25 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# చలమల్ల కుమారుని వివాహానికి హాజరైన సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చలమల్ల కృష్ణారెడ్డిరజిత దంపతుల ద్వితీయ కుమారుడు చలమల్ల వినీత్ రెడ్డి, లిపిరెడ్డిల వివాహ మహోత్సవం శంషాబాద్ లోని జీఎంఆర్ అరేనాలో ఆదివారం వైభవంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. అదేవిధంగా వివాహ వేడుకకు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, ప్రజాపతినిధులు తదితరులు హాజరయ్యారు.

## త్రిషల్ బాక్స్ క్రికెట్ ను ప్రారంభించిన మాజీ మేయర్



మేడిపల్లి, ప్రజాస్ఫూర్తి :మల్కాజ్గిరి కార్పొరేషన్ బోడుప్పల్ పరిధిలోఆదివారం త్రిషుల్ బాక్స్ క్రికెట్ ను నిర్వాహకులు వంశీ కృష్ణ ధీరజ్ కృష్ణ ల తోకలిసి బోడుప్పల్ మాజీ మేయర్ అజయ్ యాదవ్ ప్రారంభించారుఅనంతరం అజయ్ యాదవ్ మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లాసం ను ఇస్తాయి కావున ప్రతిఒక్కరు ప్రతిరోజు ఒక గంట ఫిజికల్ ఫిటినెస్ పైన శ్రద్ధ చూపాలి అని కోరారు ఈ కార్యక్రమం లోమాజీ డిప్యూటీ మేయర్ కొత్త కిషోర్ గౌడ్ 11డివిజన్ మరియు 12డివిజన్ అధ్యక్షులతో పాటు ప్రముఖ పారిశ్రామిక వేత్త బేజాడి బ్రమ్మం తదితరులు పాల్గొన్నారు.

## వేల అడుగులు ఒక్కటై.. పరుగుల పండగై..

* **ఎన్ఎండీసీ 15వ మారథాన్‌లో రికార్డుస్థాయిలో 32 వేల మంది నమోదు**



హైదరాబాద్ : దేశంలోనే రెండో అతిపెద్ద మారథాన్‌గా గుర్తింపు ఉన్న హైదరాబాద్ ఎన్ఎండీసీ తమ 15వ ఎడిషన్‌ను నిర్వహించగా రికార్డుస్థాయిలో సుమారు 32 వేల మంది వివిధ విభాగాల్లో పాల్గొన్నారు. ఆదివారం ఫుల్, హాఫ్ మారథాన్, ఎలైట్ విభాగాల్లో సుమారు 11 వేల మంది పరుగుతీశారు. 10కే రన్‌లో దాదాపు 9 వేల మంది పాల్గొన్నారు. శనివారం నిర్వహించిన 5కే, ఇన్‌క్లూజివ్ రన్‌లలో 6,500 మంది పాల్గొన్నారు. తొలిసారి నిర్వహించిన ఇన్‌క్లూజివ్ రన్‌లో దాదాపు 300 మంది దివ్యాంగులు ఉండటం విశేషం. 15 మంది విదేశీ, 30 మంది భారతీయ ఎలైట్ రన్నర్లు పోటీపడ్డారు. పీపుల్స్ ప్లాజా నుంచి ఎలైట్, ఫుల్ మారథాన్‌లను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం.రమేశ్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ జోనల్ హెడ్ ప్రశాంత్ షిండే, ఎన్ఎండీసీ డైరెక్టర్ శ్రీకృష్ణకుమార్ ఠాకూర్ తదితరులు జెండా ఊపి ప్రారంభించారు. హాఫ్ మారథాన్‌కు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ శ్రీకారం చుట్టగా, మాదాపూర్ హైటెక్ సిటీ నుంచి 10కే రన్‌ను సైబరాబాద్ సీపీ ఎం.రమేశ్, అమెరికా కాన్సుల్ జనరల్ లారా విలియమ్స్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ఎండీ, సీఈవో వి.వైద్యనాథన్ ప్రారంభించారు.

## ప్రతి కులానికి 'యూనిక్ కోడ్' కేటాయించాలి




ఐక్యత చాటుతున్న ఓబీసీ నేతలు

ఢిల్లీ: జనగణనలో కులగణనను తప్పనిసరి చేస్తూ.. ప్రతి కులానికి ప్రత్యేకంగా 'యూనిక్ కోడ్'ను కేటాయించాలని ఓబీసీ నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఓబీసీ జాతీయ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీసీ ఇంటెలెక్చువల్ ఫోరం ఛైర్మన్ టి.చిరంజీవులు, ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.కిరణ్‌కుమార్ అధ్యక్షత వహించారు. శాస్త్రీయ పద్ధతిలో జనగణన చేపట్టకపోతే రూ.వేల కోట్ల ప్రజాధనం వృథా అవుతుందని వక్తలు అభిప్రాయపడ్డారు. ప్రతి కులాన్ని నమోదు చేసేలా పారదర్శక విధానంలో లెక్కింపు జరగాలని డిమాండ్ చేశారు. సదస్సులో ఎంపీ విల్సన్, మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, ఏఐసీసీ ఓబీసీ విభాగం ఛైర్మన్ అనిల్ జైహింద్ తదితరులు పాల్గొన్నారు. ఓబీసీ రిజర్వేషన్లు అమలు చేస్తే ప్రధాన మంత్రి మోదీ చరిత్రలో నిలిచిపోతారని భారాస నేత, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. దేశంలో మెజారిటీ వర్గాలకు ఇప్పటి వరకు న్యాయం జరగలేదన్నారు. రాజకీయంగా విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో అణచివేతకు గురయ్యారన్నారు. జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు ఇవ్వాలని చెప్పిన రాహుల్ గాంధీ, ఇప్పుడు మాత్రం నోరు మెదపడం లేదని విమర్శించారు.

## సెంచరీతో అదరగొట్టిన డీజీపీ సీవీ ఆనంద్

* **సికింద్రాబాద్ క్లబ్ విజయం**



డీజీపీ సీవీ ఆనంద్ బ్యాట్‌తో అదరగొట్టారు. హెచ్‌సీఏ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా ఆదివారం హైదరాబాద్ జిల్లా జట్టుపై సికింద్రాబాద్ క్లబ్ తరఫున ఆడిన ఆయన 82 బంతుల్లో 21 ఫోర్లు, 5 సిక్సర్లతో అజేయంగా 126 పరుగులు చేశారు. ఆ జట్టు నిర్ణీత 39 ఓవర్లలో 7 వికెట్లకు 328 పరుగులు చేసింది. అనంతరం హైదరాబాద్ జిల్లా జట్టు 21.1 ఓవర్లలో 3 వికెట్లకు 72 పరుగులు చేయగా వాతావరణం అనుకూలించకపోవడంతో వీజేడీ పద్ధతిలో సికింద్రాబాద్ క్లబ్‌ను విజేతగా ప్రకటించారు

# ట్రాఫిక్ పద్మవ్యూహంలో వికారాబాద్..!

* **కిలోమీటర్ల మేర నిలిచిపోతున్న వాహనాలు**
* **పట్టించుకునే వారెవరు..?**

వికారాబాద్, ప్రజాస్ఫూర్తి : రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్‌తో వికారాబాద్ పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకప్పుడు నిమిషాల్లో దాటిపోయే ప్రధాన రహదారులు ఇప్పుడు వాహనాలతో కిక్కిరిసిపోతున్నాయి. ముఖ్యంగా పట్టణంలోని ప్రధాన చౌరస్తాల వద్ద ట్రాఫిక్ జామ్‌లు నిత్యకృత్యంగా మారుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈరోజు పరిస్థితి మరింత తీవ్రంగా కనిపించింది. ఎంఆర్పీ పెట్రోల్ బంక్ నుంచి బీజేఆర్ చౌరస్తా వరకు చేరుకోవడానికే దాదాపు అరగంట సమయం పట్టిందని వాహనదారులు చెబుతున్నారు.. రోడ్డుపై ఎటు చూసినా వాహనాలే కనిపించడంతో పలుచోట్ల ట్రాఫిక్ స్తంభించిపోయింది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర అసహనానికి గురయ్యారు.ఈరోజు పెళ్లిళ్లు, శుభకార్యాలు, ఇతర విందులు ఎక్కువగా ఉండటం ట్రాఫిక్ పెరగడానికి ఒక కారణం కావచ్చు. కానీ సమస్య ఒక్కరోజుదే కాదన్నది వికారాబాద్ ప్రజల ప్రధాన ఆవేదన. సాధారణ రోజుల్లోనూ ప్రధాన చౌరస్తాలు, రద్దీ ప్రాంతాల్లో ఇదే పరిస్థితి ఎదురవుతోందని చెబుతున్నారు. పట్టణం విస్తరిస్తోంది... వాహనాల సంఖ్య పెరుగుతోంది... కానీ అందుకు తగ్గట్టుగా ట్రాఫిక్ నిర్వహణ, రహదారుల అభివృద్ధి జరుగుతోందా? అనే ప్రశ్న ఇప్పుడు బలంగా వినిపిస్తోంది.ఇంకెంతకాలం ఈ ట్రాఫిక్



నరకం..? ప్రధాన చౌరస్తాలను విస్తరిస్తారా? ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను మరింత పటిష్టం చేస్తారా? రద్దీ సమయాల్లో అదనపు ట్రాఫిక్ పోలీసులను నియమిస్తారా? పార్కింగ్, ఆక్రమణలు, రోడ్డు పక్కన అడ్డంకులపై చర్యలు తీసుకుంటారా? ప్రత్యామ్నాయ మార్గాలను అభివృద్ధి చేస్తారా? అన్న ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని ప్రజలు అంటున్నారు. అత్యవసర సమయంలో అంబులెన్స్‌లు, ఇతర ఎమర్జెన్సీ వాహనాలు ఇలాంటి ట్రాఫిక్‌లో చిక్కుకుంటే పరిస్థితి ఏంటన్న ఆందోళన కూడా వ్యక్తమవుతోంది. సమస్య మరింత జటిలం కాకముందే అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి శాశ్వత పరిష్కారం చూపాలని వికారాబాద్ ప్రజలు కోరుతున్నారు. వికారాబాద్ అభివృద్ధి చెందాలి... కానీ ఆ అభివృద్ధి ట్రాఫిక్ పద్మవ్యూహంగా మారకూడదు. ప్రజలు రోడ్లపై గంటలు గడిపే పరిస్థితి రాకముందే చర్యలు మొదలవ్వాలి..!

## చలో వరంగల్ మహిళ ఉమ్మడి జిల్లా సదస్సును జయప్రదం చేయండి



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : పద్మశ్రీ మంద క్రిష్ణ మాదిగ ఆదేశాల మేరకు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో స్థానిక అంబేద్కర్ భవనంలో ఏర్పాటు చేసిన మహిళా ముఖ్యుల సమావేశం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాదిగ మహిళా సమాఖ్య జాతీయ అధికార ప్రతినిధి ఇనుగుర్తి మణి మాదిగ, మహాజన మహిళా మండలి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు ఎండి రజియా లు పాల్గొని మాట్లాడుతూ సెప్టెంబర్ 3న ఉమ్మడి వరంగల్ లో జరగబోయే మాదిగ మహిళా సమాఖ్య (ఎమ్ ఎమ్ ఎస్), మహాజన మహిళా మండలి (ఎమ్,ఎమ్, ఎమ్) ఉమ్మడి జిల్లా సదస్సును విజయవంతం చేయాలని,అలాగే రాష్ట్రంలో అన్ని గ్రామ,మండల, జిల్లాల నూతన కమిటీలను పూర్తి చేసుకోవాలని పిలుపునిచ్చారు.జిల్లాలో ఉండబడిన మహిళా నాయకత్వం మొత్తం సెప్టెంబర్ 3న వరంగల్ కు చేరుకొని సదస్సును విజయవంతం చేయాలని పిలుపునివ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో పూల సింధుజా,మలోత్ శారద,గుగులోతు జ్యోతి,మందుల తిరుమల,కందిపాటి మంగమ్మ, పోలేపంగు హేశ్వరి,ధారవత్ నీలా,బానోతు సోనీ,గుండెపాక ప్రమీల,బానోతు దుర్గా,పూల తిరుపతమ్మ,పొడుగు పద్మ తదితరులు పాల్గొన్నారు.

## జానపద కళలకు కళాకారులే జీవం

* **గుర్తింపు కార్డులతో సంక్షేమ పథకాలు చేరువ**
* **జానపద యూనివర్సిటీ కోసం సీఎం దృష్టికి తీసుకెళ్తా: ఎమ్మెల్యే జీఎస్సార్**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి: తెలంగాణ జానపద కళలు, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంలో కళాకారుల పాత్ర ఎంతో కీలకమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. జానపద కళాకారులకు రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు కార్డులు అందిస్తున్న సందర్భంగా ఆదివారం భూపాలపల్లి అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన కృతజ్ఞత సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహం నుంచి అంబేద్కర్ స్టేడియం వరకు కళాకారులు సంప్రదాయ వాద్యాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ర్యాలీలో పాల్గొని కళాకారులను అభినందించారు. అనంతరం స్టేడియంలో జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించారు.

* **కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది**

కళాకారులకు గుర్తింపు కార్డులు అందించడం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు వారికి చేరువయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే తెలిపారు. ఎన్నో ఏళ్లుగా కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జానపద కళలను భావితరాలకు అందించేందుకు కళాకారులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. జానపద కళాకారులు కోరుతున్న జానపద యూనివర్సిటీ అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, యూనివర్సిటీ మంజూరుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం కళాకారులకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్యగౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తోజు కిష్టయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, స్థానిక ప్రజాప్రతినిధులు, జానపద కళాకారులు, కాంగ్రెస్ నాయకులు, వివిధ కళా సంఘాల ప్రతినిధులు, అధికారులు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరు ఈనెల 31వ తేదీలోగా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి

* **జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : అర్హులైన వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న దివ్యాంగులు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులకు ప్రభుత్వం చేయూత పింఛన్ల ద్వారా సామాజిక భద్రత కల్పిస్తోందని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, పట్టణ ప్రాంతాల్లో వార్డు అధికారులు, మున్సిపల్ కమిషనర్లు చేయూత పింఛన్ల కొరకు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. చేయూత పింఛన్ల దరఖాస్తు ఫారాలను చేయూత వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, అలాగే నింపిన దరఖాస్తులను ఎంపీడీఓ కార్యాలయాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, మున్సిపాలిటీ కార్యాలయాల్లో సమర్పించాలని విజ్ఞప్తి చేశారు.

* **పింఛను రకాలు - అర్హతా ప్రమాణాలు**

వితంతువులు 18 సం.లు పైబడిన వారు, భర్త మరణ ధృవీకరణ పత్రం, ఒంటరి మహిళలు వివాహితులు: 18 సం.లు పైబడిన వారు, భర్తతో విడిపోయి/ వదిలివేయబడి 1 సం.లు పైబడిన వారు, అవివాహితులు గ్రామీణ ప్రాంతాల్లో 30 సం.లు పైబడిన వారు పట్టణ ప్రాంతాల్లో 35 సం.లు పైబడిన వారు దివ్యాంగులు వయసుతో సంబంధం లేదు, సదరమ్ , యుడిఐడి ధృవీకరణ ద్వారా 40% వైకల్యం (వినికిడి లోపం ఉన్నవారికి 51%) రక్త సంబంధిత దివ్యాంగులు తలసేమియా, సికిల్ సెల్ డిసీస్, హీమోఫీలియా (సదరమ్ , యుడిఐడి ధృవీకరణ), కల్లుగీత కార్మికులు 50 సం.లు పైబడిన వారు కల్లుగీత కార్మికుల సహకార సంఘ సభ్యత్వం, ఎక్సైజ్ శాఖ ధృవీకరణ, చేనేత కార్మికులు 50 సం.లు పైబడిన వారు, చేనేత & జౌళి శాఖ ధృవీకరణ, ఫైలేరియా బాధితులు గ్రేడ్II & III ఫైలేరియా వ్యాధిగ్రస్తులు, దరఖాస్తుల స్వీకరణ , గ్రామీణ ప్రాంతాలలో పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు , పట్టణ ప్రాంతాలలో వార్డు అధికారులు, పురపాలక కమీషనర్లు దరఖాస్తు ఫారాలను https://cheyutha.telangana.gov.in వెబ్‌సైట్‌లోని "cheyutha application forms" బటన్ నొక్కి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

## సుంక్లి గ్రామంలో అన్న బాహు సాఠే విగ్రహం ఆవిష్కరణ



ప్రజాస్ఫూర్తి , భైంసా: నిర్మల్ జిల్లా భైంసా మండలం సుంక్లి గ్రామంలో సాహిత్య సామ్రాట్ శ్రీ అన్న బాహు సాఠే జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన అన్న బాహు సాఠే విగ్రహాన్ని ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నభౌ సాఠే బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం తన రచనలు, కవితల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని కొనియాడారు. అన్న బాహు సాఠే రచనలు సామాజిక అసమానతలపై పోరాటానికి స్ఫూర్తినిచ్చాయని, అణగారిన వర్గాల హక్కుల సాధనకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. సమాజంలోని పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే రామారావు పటేల్ తెలిపారు. రానున్న రోజుల్లో బిజ్జూర్ నుండి పెంచికల్ పాడ్ వయ సుంక్లి బీటీ రోడ్డు, మరియు వంతెన నిర్మాణ పనులను ప్రారంభిస్తామని అలాగే వానల్ పాడ్ నుండి వంజర వరకు డబల్ నిర్మాణ పనులు పూర్తి చేస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.గత పాలకుల నిర్లక్ష్యం కారణంగానే ముధోల్ నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిందని ఎమ్మెల్యే విమర్శించారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని తెలిపారు.అన్న బాహు సాఠే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి అన్ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ప్రజాప్రతినిధులు, మండల సీనియర్ ఎంఆర్‌పీఎస్ నాయకులు, అన్న బాహు సాఠే అభిమానులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## క్లస్టర్4 విభాగంలో సూర్యాపేట జిల్లా పోలీసు శాఖకు రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంక్



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట:సూర్యాపేట జిల్లా పోలీసు శాఖ శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పనితీరులో రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచింది. క్లస్టర్4 విభాగంలో జిల్లా సాధించిన సమగ్ర పనితీరును గుర్తించి, జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ కి రాష్ట్ర డిజిపి సి.వి. ఆనంద్, ఐపీఎస్ ప్రశంసా పత్రాన్ని అందజేశారు. మొత్తం 8 కీలక పనితీరు సూచికల ఆధారంగా ఈ ర్యాంకింగ్ కేటాయించారు, చార్జ్‌షీట్ రేటు, నేరాల గుర్తింపు రేటు., శిక్షల శాతం, సగటు దర్యాప్తు సమయం, బాధితుల ఇంటి వద్ద కేసుల నమోదు, ఈపెట్టీ కేసులు, ఈచలాన్లు, డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు. విధి నిర్వహణలో చూపిన అంకితభావం, నైపుణ్యం మరియు విశిష్ట సేవలకు గాను జిల్లా పోలీసు సిబ్బందిని డిజిపి ప్రత్యేకంగా అభినందించారు. సాంకేతికతను సద్వినియోగం చేసుకుని జిల్లా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని ఎస్పీ నరసింహ ఐపీఎస్ అన్నారు. నేరాలను నిరోధిస్తూ పని చేస్తున్నాము, కేసుల దర్యాప్తు వేగంగా చేస్తున్నాము, బలమైన ఆధారాలు, సాక్ష్యాలను సేకరించి కోర్టుకు అందజేస్తున్నారు, కేసుల్లో నేరస్థులకు జైలు శిక్షలు పడుతున్నాయని అన్నారు.

## జగద్గిరి నగర్ లో అన్న ప్రసాద కార్యక్రమం



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : జగద్గిరిగుట్ట డివిజన్ జగద్గిరి నగర్ లోని అమ్మవారి ఆలయంలో బోనాల పండుగ సందర్భంగా భక్తులు సమర్పించిన ఓడి బియ్యం తో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అన్న ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యువ నాయకులు కొలుకుల జైహింద్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో నాయకులు హనుమాన్ చారి, కనకయ్య, శంకర్,నర్సింగ్ రావు, రాజేష్, నాగరాజ్, శ్రీనివాస్ చారి, తిరుపతి చారి, హనుమంతు, శిల్పి నరసయ్య, ఓబుల్ రెడ్డి, రాయి విగ్నేష్, ఆంజనేయులు, మైలారం రాజు, తదితరులు పాల్గొన్నారు.

## నీట్‌పీజీకి రెండు కేంద్రాల్లో తీవ్ర అంతరాయం

ఢిల్లీ హైదరాబాద్: కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య దేశవ్యాప్తంగా నీట్‌పీజీ (2026)ని విజయవంతంగా నిర్వహించినట్లు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఎంఎస్) వెల్లడించింది. 339 నగరాల్లోని 1,111 కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన ఈ పరీక్షకు 2.63 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపింది. అయితే, జైపుర్‌లోని సీతాపురాలో రెండు ఐడీజడ్ కేంద్రాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం వల్ల 2,445 మంది అభ్యర్థులు పరీక్షను పూర్తి చేయలేకపోయారు. వీరికి సెప్టెంబరు 5న జైపుర్‌లో మళ్లీ పరీక్ష నిర్వహిస్తామన్నారు. కాగా, రాష్ట్రంలో 'నీట్ పీజీ2026' ఆదివారం ప్రశాంతంగా జరిగింది. 14 జిల్లాల్లోని 56 పరీక్ష కేంద్రాల్లో 17,143 (97.26%) మంది అభ్యర్థులు హాజరుకాగా, 483 మంది గైర్హాజరయ్యారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని టీసీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రీజనల్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, శాఖ కార్యదర్శి క్రిస్టినా పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు.



# పండ్లను కోసిన తర్వాత ఎంతసేపట్లో తినాలి..?

**పండ్లు మన ఆరోగ్యానికి ఎంత మంచివో మనందరికీ తెలుసు. డాక్టర్లు సైతం ఆహారంలో పండ్లను చేర్చుకోవాలని చెబుతారు. కానీ చాలా మంది పండ్లను కోసి కొన్ని గంటల తర్వాత తింటారు. అయితే కోసిన తర్వాత ఎంతసేపట్లో తినాలో తెలుసుకోవడం చాలా ముఖ్యం. లేకపోతే అది మన శరీరం పై చెడు ప్రభావాన్ని చూపుతుంది.**

పండ్లు మన శరీరానికి మంచివని అందరికీ తెలుసు. ప్రతిరోజ పండ్లను తినడం ఆరోగ్యానికి మంచిది. విటమిన్లు, మినరల్స్, యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ వంటివి పండ్లలో సమృద్ధిగా ఉంటాయి. పండ్లు తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. ప్రతి ఒక్కరూ తమ ఆహారంలో పండ్లను చేర్చుకోవాలని వైద్యులు సూచిస్తారు. కొన్నిసార్లు మనం పండ్లను కోసి అలాగే ఉంచుతాం. ఆఫీసులు, ఏదైన ప్రయాణ సమయాల్లో కోసి తీసుకెళ్తుంటారు. కొంతమంది కోసి ఫ్రిజ్‌లో పెడతారు. కొన్ని గంటల తర్వాత వాటిని తింటారు. కానీ కోసిన పండ్లను ఎంతసేపట్లో తినాలి..? అవి ఎంతకాలం మంచిగా ఉంటాయి అనేది చాలా మందికి తెలియదు. ఇవి తెలుసుకోవడం చాలా ముఖ్యం.

### పండ్లు తినడానికి సరైన సమయం ఏమిటి?

పండ్లను ఏ సమయంలో తిన్న మంచిదేనని నిపుణులు అంటున్నారు. అయితే కొన్నింటిని ఉదయం ఖాళీ కడుపుతో, మరికొన్నింటిని రాత్రి వేళలో తినకూడదని చెబుతారు. ఏదైనా సరే మితంగా తీసుకుంటే ఆరోగ్యానికి మంచిదని అంటున్నారు.

### కోసిన తర్వాత ఎంతసేపట్లో తినాలి..?

కోసిన వెంటనే పండ్లు చెడిపోవు. కానీ వాటిని ఎంత త్వరగా తింటే అంత మంచిది. నిజానికి కోసిన పండ్లలో ఇన్ఫెక్షన్ ప్రమాదం పెరుగుతుంది. వేసవి, వర్షాకాలం సూక్ష్మజీవుల పెరుగుదలకు ఉత్తమ సమయాలు. కోసిన పండ్ల వల్ల ఇన్ఫెక్షన్ ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ఎక్కువసేపు నిల్వ చేయకుండా వీలైనంత త్వరగా వాటిని తినాలి. పండ్ల నుండి అన్ని పోషకాలను పొందడానికి వాటిని కోసిన అరగంటలోపు తినడం ఎల్లప్పుడూ మంచిదని అంటున్నారు.



# ఈ ఆహారాలను తీసుకోవడం వల్ల కిడ్నీలు శుభ్రం, ఆరోగ్యం

మన శరీరంలో ఎప్పటికప్పుడు ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను కిడ్నీలు మూత్రం ద్వారా బయటకు పంపిస్తాయి. దీంతో శరీరంలో వ్యర్థాలు పేరుకుపోకుండా ఉంటాయి. ఆరోగ్యంగా ఉంటాము. అయితే మనం పాటించే ఆహారపు అలవాట్లు, జీవనశైలి, దీర్ఘకాలిక వ్యాధులు, వాడే మందులు వంటి కారణాల వల్ల మన కిడ్నీల పనితీరు మందగిస్తుంది. దీంతో వ్యర్థాలను కిడ్నీలు సరిగ్గా బయటకు పంపలేకపోతాయి. దీని వల్ల దీర్ఘకాలంలో శరీరంలో వ్యర్థాలు పేరుకుపోతాయి. ఇవి అనేక వ్యాధులను కలగజేస్తాయి. అందువల్ల కిడ్నీలను మనం ఆరోగ్యంగా ఉంచుకోవాలి. కిడ్నీలు ఎప్పటికప్పుడు వ్యర్థాలను బయటకు పంపిస్తూ శుభ్రంగా ఉండాలి. అప్పుడే మనం ఆరోగ్యంగా ఉంటాం. అయితే పలు రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల కిడ్నీలను శుభ్రంగా, ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. దీని వల్ల ఇతర వ్యాధులు రాకుండా కూడా అడ్డుకోవచ్చు.

### కొబ్బరినీళ్లు, యాపిల్ సైడర్ వెనిగర్..

కొబ్బరినీళ్లను రోజూ తాగడం వల్ల శరీరానికి ఎంతో మేలు జరుగుతుంది. దీని వల్ల శిరోజాలు, చర్మం సురక్షితంగా, ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే కిడ్నీ సమస్యలు రాకుండా అడ్డుకోవచ్చు. కిడ్నీలు శుభ్రంగా మారుతాయి. కొబ్బరినీళ్లలో ఉండే ఎలక్ట్రోలైట్స్ కిడ్నీలను సురక్షితంగా ఉంచుతాయి. అలాగే కిడ్నీల ఆరోగ్యానికి యాపిల్ సైడర్ వెనిగర్ కూడా పనిచేస్తుంది. రోజూ ఉదయం పరగడుపునే ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో ఒక టీస్పూన్ యాపిల్ సైడర్ వెనిగర్ కలిపి తాగుతుంటే కిడ్నీలు క్లీన్ అయి ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే బరువు తగ్గేందుకు కూడా ఇది ఎంతగానో పనిచేస్తుంది. షుగర్, కొలెస్ట్రాల్ స్థాయిలను సైతం అదుపులో ఉంచుతుంది. ఇక కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచేందుకు గాను పలు పండ్లు కూడా సహాయం చేస్తాయి. స్ట్రాబెర్రీలు, చెర్రీలు, యాపిల్స్, క్రాన్ బెర్రీలు, ద్రాక్ష, పైనాపిల్ వంటి పండ్లను తింటుంటే మేలు జరుగుతుంది.

### ఈ ఆహారాలు కూడా అవసరమే..

అరటి పండ్లు, నారింజ పండ్లలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది శరీరంలోని సోడియం స్థాయిలను తగ్గిస్తుంది. దీని వల్ల కిడ్నీలు శుభ్రంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే కాలిఫ్లవర్, క్యాబేజీ, ఎరుపు రంగు క్యాప్సికం, ముల్లంగి వంటి కూరగాయలను తింటున్నా కూడా కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటాయి. కోడిగుడ్డు తెల్ల సొన, స్కిన్ లెస్ చికెన్, చేపలు, ఆలివ్ ఆయిల్, వెల్లుల్లి, ఉల్లిపాయలు వంటి ఆహారాలను కూడా తీసుకోవచ్చు. అయితే కిడ్నీలు ఎల్లప్పుడూ శుభ్రంగా, ఆరోగ్యంగా ఉండేందుకు గాను ఆహారంలో ఉప్పు తీసుకోవడం తగ్గించాలి. సోడియం తక్కువగా ఉండే ఆహారాలను తినాలి. మద్యం సేవించడం, పొగ తాగడం మానేయాలి. ఆకుకూరలు, కూరగాయలను, పండ్లను తినేందుకు అధిక ప్రాధాన్యతను ఇవ్వాలి. అలాగే రోజూ నీళ్లను తగిన మోతాదులో తాగాలి. ఇలా ఆహారపు అలవాట్లను పాటిస్తుంటే కిడ్నీలు శుభ్రంగా ఆరోగ్యంగా ఉంటాయి.

### బీట్ రూట్, నిమ్మరసం..

మనం బీట్‌రూట్‌ను అప్పుడప్పుడు తింటుంటాం. కానీ బీట్‌రూట్‌ను రోజువారి ఆహారంలో కచ్చితంగా భాగం చేసుకోవాలి. బీట్ రూట్‌లో పొటాషియం, నైట్రేట్లు, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి కిడ్నీలను శుభ్రం చేసి ఆరోగ్యంగా ఉంచుతాయి. రోజూ ఒక కప్పు బీట్ రూట్ ముక్కలను తింటుండాలి. లేదా ఒక కప్పు బీట్ రూట్ జ్యూస్‌ను అయినా తాగవచ్చు. దీని వల్ల కిడ్నీల ఆరోగ్యం మెరుగుపడుతుంది. అలాగే కిడ్నీల ఆరోగ్యానికి నిమ్మరసం కూడా ఎంతగానో పనిచేస్తుంది. నిమ్మరసంలో విటమిన్ సి ఉంటుంది. కిడ్నీ స్టోన్లు ఏర్పడకుండా రక్షిస్తుంది. అదేవిధంగా అల్లం రసం కూడా ఎంతగానో మేలు చేస్తుంది. రోజూ ఉదయం పరగడుపునే అల్లం రసాన్ని ఒక టీస్పూన్ మోతాదులో తాగుతుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది.



# పొద్దునే ప్రొటీన్ ఫుడ్

పొద్దున నిద్ర లేచిన వేళా విశేషమే రోజంతటినీ నిర్ణయిస్తుంది. పొద్దునే మన టిఫిన్లలో ఇడ్లీ, పోహా, ఉప్మా, ఆలూ పరాఠా లాంటివి ప్రధానంగా ఉంటాయి. ఇవన్నీ కార్బొహైడ్రేట్లతో నిండి ఉంటాయి. కానీ ఆరోగ్యానికి అత్యవసర పోషకమైన ప్రొటీన్ ఉండదు. అయితే, ఉపాహారం నుంచే 20 గ్రాముల ప్రొటీన్ అందేలా చూసుకుంటే మంచిది. అలాగని ప్రొటీన్ పౌడర్ల మీద ఆధారపడకూడదు. ఆహారంలో కొన్ని చిన్న మార్పులు చేసుకుంటే సరిపోతుంది. పొద్దునే ఆరగించడానికి ప్రొటీన్లతో సమృద్ధమైన టిఫిన్లు కొన్నిటి గురించి తెలుసుకుందాం. శరీర విధులు సాఫీగా సాగాలంటే ప్రొటీన్లు సమృద్ధిగా ఉన్న ఆహారం తీసుకోవాలి. శరీర కణజాలం, కండరాలు, ఎముకలు, చర్మం, వెంట్రుకలు, గోళ్ల నిర్మాణంలో ప్రొటీన్లు కీలకంగా నిలుస్తాయి. ఎంజైముల విడుదలలో ఇవి కీలకపాత్ర పోషిస్తాయి. అంతేకాదు ప్రొటీన్లు మన రోగ నిరోధక వ్యవస్థలో అంతర్భాగం. ప్రొటీన్లు తీసుకుంటూ తగినంత వ్యాయామం చేస్తే ఆరోగ్యకరమైన జీవితం సొంతమవుతుంది. ప్రొటీన్లు శరీరానికి మాత్రమే కాదు మెదడు పనితీరుకు కూడా అండగా నిలుస్తాయి.

### పల్లీలు కూరగాయలతో క్వినోవా ఉప్మా

ఓ కప్పు క్వినోవాలో 8 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. దీనికి కూరగాయలు, కరివేపాకు, ఓ టేబుల్ స్పూన్ వేయించిన పల్లీలు, పచ్చి బఠాణీలు కలపాలి. ఉడికించిన శనగలతో సలాడ్ తీసుకుంటే మొత్తం 22 గ్రాముల ప్రొటీన్లు దొరుకుతాయి. ఒక్క క్వినోవా ఉప్మా, కూరగాయలు, పల్లీల నుంచే 17 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### శనగపిండి టోస్ట్, టోఫు బుర్జి

రెండు బ్రెడ్ పకోడీలు (శనగపిండితో చేసినవి) తీసుకోవాలి. దీనికి 75 గ్రాముల టోఫు బుర్జీ జతచేయాలి. టమాటాలు, పసుపు, జీలకర్ర కలపాలి. దీని ద్వారా 23 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### రాజ్మా పరాఠా, కప్పు పెరుగు

మామూలుగా రాజ్మా లంచ్‌కే అనుకుంటారు. కానీ ఓ కప్పు రాజ్మాను ఉడికించి ముద్దగా చేసుకోవాలి. దాన్ని పరాఠా స్టఫ్‌గా వాడుకోవాలి. ఇలా చేస్తే 15 గ్రాముల ప్రొటీన్ దొరుకుతుంది. దీన్ని పుదీనా, సైంధవ లవణం కలిపిన హంగ్ కర్డ్ (నీళ్లు తీసేసిన పెరుగు)లో అద్దుకుని తినేయాలి.

### సత్తు పరాఠా, ఉడికించిన గుడ్డు, బటర్ మిల్క్

సత్తు అంటే వేసవి పానీయం మాత్రమే కాదు. 100 గ్రాముల సత్తులో 20 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. కాబట్టి, కొద్దిగా నెయ్యి వేసి సత్తు పరాఠా చేసుకోవాలి. తినే వాళ్లయితే దీంతోపాటు ఓ ఉడికించిన గుడ్డు తినాలి. గ్లాసెడు బటర్ మిల్క్ తాగాలి. రెండు మోస్తరు సత్తు పరాఠాల నుంచి 14 గ్రాములు, ఉడికించిన గుడ్డు నుంచి 6 గ్రాములు, బటర్‌మిల్క్ నుంచి 2 గ్రాములు.. మొత్తంగా 22 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### మూంగ్‌దాల్ చిల్లా పనీర్ ఫిల్లింగ్

ఒక్కో చిల్లా (దోశ లాంటిది)లో 5 6 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. వీటిలో నింపే 50 గ్రాముల తురిమిన పనీర్ నుంచి 9 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి. రెండు చిల్లాలను ఓ కప్పు పెరుగుతో లాగించేయాలి. పెరుగుతో లభించే 5 గ్రాములతో కలుపుకొని మొత్తం 26 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

### మొలక పెసర్లు ఓట్స్ చీలా

ఇది కూడా దోశలా చేసుకునేదే. అరకప్పు ఓట్స్‌లో 5 గ్రాముల ప్రొటీన్ దొరుకుతుంది. దీన్ని ఓ కప్పు పెసర మొలకలతో కలిపితే మరో 14 గ్రాములు లభిస్తాయి. దీనికి కాస్త శనగపిండిని జోడిస్తే మరో 2 గ్రాములు మొత్తంగా 21 గ్రాముల ప్రొటీన్లు దొరుకుతాయి.



# MOVIE TIME



## రీమేక్ మూవీలో శ్రీకృష్ణుడి పాత్ర

లో బడ్జెట్‌తో తెరకెక్కిన గుజరాతీ మూవీ లాలో కృష్ణ సదా సహాయతే తెలుగులోకి రీమేక్ కానుంది. ఇందులో శ్రీకృష్ణుడిగా టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ నటించనున్నట్లు తెలిసింది. ఓ యంగ్ హీరో ప్రధాన పాత్రలో నటిస్తుండగా విజయ్ గెస్ట్‌గా కనిపించబోతున్నట్లు సమాచారం. ఈ సినిమా రీమేక్ రైట్స్‌ను ప్రముఖ నిర్మాత దిల్‌రాజు దక్కించుకున్నట్లు సమాచారం. త్వరలోనే ఈ రీమేక్‌పై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రానున్నట్లు తెలిసింది. కేవలం 50 లక్షల బడ్జెట్‌తో రూపొందిన ఈ గుజరాతీ మూవీ రూ.120 కోట్ల వసూళ్లను రాబట్టింది. ఆర్థిక ఇబ్బందులతో తప్పులు చేసిన ఓ ఆటో డ్రైవర్‌లో శ్రీకృష్ణుడు ఎలా మార్పు తీసుకొచ్చాడనే పాయింట్‌తో తెరకెక్కించారు. అంకిత్ సఖియా దర్శకత్వం వహించాడు.



## చిక్కుల్లో రంభ ఊర్వశి మేనక

అల్లరి నరేష్ రంభ ఊర్వశి మేనక మూవీ రిలీజ్‌కు ముందే చిక్కుల్లో పడింది. ఈ సినిమాలో విష్ణుప్రియ, రాశీసింగ్‌తో పాటు ప్రిషా సింగ్ పాత్రలను చూపించిన విధానంపై సెన్సార్ నుంచి అభ్యంతరాలు వ్యక్తమైనట్లు సమాచారం. వారి పాత్రలకు సంబంధించిన డైలాగ్స్ విషయంలో చాలానే మార్పులు సూచించినట్లు చెబుతున్నారు. సెన్సార్ అడ్డంకుల కారణంగా ఈ సినిమా రిలీజ్‌పై అనుమానాలు వ్యక్తమవుతోన్నాయి. సెప్టెంబర్ 4న విడుదల కావాల్సిన ఈ మూవీ వాయిదాపడే అవకాశాలున్నాయని అంటున్నారు. సెన్సార్ అభ్యంతరాలపై మేకర్స్ రివైజింగ్ కమిటీకి వెళ్లినట్లు చెబుతున్నారు. రేపు సెన్సార్ సర్టిఫికెట్‌పై క్లారిటీ రానున్నట్లు తెలిసింది. అన్నపూర్ణ స్టూడియోస్‌తో కలిసి రాజేష్ దండా ఈ సినిమాను నిర్మించారు. సోషియో ఫాంటసీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోన్న ఈ సినిమాకు చంద్రమోహన్ చింతాడ దర్శకత్వం వహించారు.



## ఓటీటీలోకి కొరియన్ కనకరాజు

మెగా హీరో వరుణ్‌తేజ్ బ్లాక్‌బస్టర్ మూవీ కొరియన్ కనకరాజు ఓటీటీ రిలీజ్ డేట్ కన్ఫామ్ అయ్యింది. సెప్టెంబర్ 4 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో ఈ హారర్ కామెడీ మూవీ స్ట్రీమింగ్ కాబోతుంది. ఆగస్ట్ ఫస్ట్ వీక్‌లో థియేటర్లలో రిలీజైన ఈ మూవీ పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. దాదాపు 30 కోట్ల బడ్జెట్‌తో రూపొందగా 40 కోట్లకు పైగా కలెక్షన్స్ దక్కించుకుంది. ఓటీటీ, శాటిలైట్‌తో పాటు మ్యూజికల్ రైట్స్ ద్వారా మేకర్స్‌కు మరో ఇరవై ఐదు కోట్ల వరకు వచ్చినట్లు సమాచారం. నిర్మాతలకు ఈ మెగా హీరో మూవీ భారీగా లాభాలు తెచ్చిపెట్టింది. రితికా నాయక్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో కమెడియన్ సత్య కీలక పాత్ర పోషించాడు. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహించగా తమన్ మ్యూజిక్ అందించాడు.





## డ్రామాలు ఆడకు

మనీ లాండరింగ్ కేసులో జైలు శిక్షను అనుభవిస్తున్న సుఖేష్ చంద్రశేఖర్‌తో తనకు ఎలాంటి సంబంధం లేదని ఇటీవల బాలీవుడ్ బ్యూటీ నోరా ఫతేహి ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నది. ఆమె కామెంట్లపై సుఖేష్ ఓ లేఖ ద్వారా బదులిచ్చారు. "నా దగ్గర నుంచి ఎప్పుడూ డబ్బు తీసుకోలేదని అబద్ధాలు చెబుతున్నావు. నేను ఇచ్చిన కోట్ల రూపాయల డబ్బుతోనే మొరాకోలోని కాసాబ్లాంకాలో నువ్వు ఇల్లు కొనుగోలు చేసింది నిజం కాదా? ఆ టైమ్‌లో మన మధ్య జరిగిన చాటింగ్ ఇప్పటికీ నా వద్ద ఉంది. నువ్వు చెప్పేవి నిజాలే అయితే ఆ మెసేజ్‌లు అందరికి చూపించు. బాధితురాలినంటూ సింపథీ కోసం డ్రామాలు ఆడుతుంది. ఆమెకు ఓ బీఎండబ్ల్యూ కారు గిఫ్ట్‌గా ఇస్తే లవ్ యూ బ్యాడ్ బాయ్ అంటూ మెసేజ్ పంపించింది. జాక్వెలిన్ ఫెర్నేండేజ్‌తో సన్నిహితంగా ఉండటం నోరా తట్టుకోలేకపోయింది. అంటే సుఖేశ్ ఆ లేఖలో రాసుకొచ్చాడు. ప్రస్తుతం ఈ లెటర్ సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతోంది.



## విజయ్ మాల్యా జీవితంపై వెబ్‌సిరీస్

బ్యాంకులకు వేల కోట్లు ఎగవేసి విదేశాలకు పారిపోయిన వ్యాపారవేత్త విజయ్ మాల్యా జీవితం ఆధారంగా ఓ వెబ్‌సిరీస్ రాబోతుంది. బిలియనీర్ పేరుతో తెరకెక్కుతోన్న ఈ సిరీస్‌లో విజయ్ మాల్యా పాత్రలో బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్ కనిపించబోతున్నారు. బాలీవుడ్ సీనియర్ డైరెక్టర్ హన్సల్ మెహతా, రాబీ గ్రేవాల్ ఈ సిరీస్‌కు దర్శకత్వం వహిస్తున్నారు. నవంబర్ నుంచి బిలియనీర్ షూటింగ్ మొదలుకాబోతున్నట్లు మేకర్స్ వెల్లడించారు. అమెజాన్ ప్రైమ్ ఓటీటీ నిర్మిస్తున్న ఈ సిరీస్ వచ్చే ఏడాది స్ట్రీమింగ్ కాబోతుంది.



టాలీవుడ్ హీరోయిన్ సమంత త్వరలోనే మాతృత్వపు బంధంలోకి అడుగుపెట్టబోతుంది. ప్రెగ్నెన్సీ కారణంగా ప్రస్తుతం షూటింగ్‌లకు బ్రేక్ ఇచ్చింది. ఈ గ్యాప్‌ను తన మనసుకు నచ్చిన పనులతో ఆస్వాదిస్తోంది. తాజాగా బేబీ బంప్‌తో దిగిన కొత్త ఫొటోలను సమంత సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఈ ఫొటోలు వైరల్ అవుతోన్నాయి.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.